తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

శుక్రవారం 20 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

ఇంకెంతమంది ప్రాణాలు కోల్పోతే పాలకులు స్పందిస్తారు?

- జలాల్‌పూర్ చెరువు కట్టను వెడల్పు చేయాలి
- ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలి
- బీజేపీ ఆధ్వర్యంలో మండల, పట్టణ కమిటీల ధర్నా



భూదాన్ పోచంపల్లి, నవంబర్ 19 (జనంసాక్షి):
జలాల్‌పూర్ చెరువు కట్టను వెడల్పు చేసి, పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ భూదాన్ పోచంపల్లి మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. జలాల్ పూర్ చెరువు కట్టపై రహదారి అత్యంత ఇరుకుగా ఉండటంతో పాటు ప్రమాదకరమైన మలుపులు ఉండటంవల్ల నిత్యం ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ మార్గంలో కొత్తగా ప్రయాణించే వారికి రహదారి సరిగ్గా అర్థం కాక వాహనాలు అదుపుతప్పి నేరుగా చెరువులోకి దూసుకెళ్తున్నాయని, ఈ ప్రమాదాల్లో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ నాయకులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఇదే రహదారి గుండా ప్రయాణిస్తున్నప్పటికీ సమస్యను పట్టించుకోకపోవడం దారుణ మన్నారు. ఇంకెంతమంది ప్రాణాలు కోల్పోతే పాలకులు స్పందిస్తారని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. ఎన్నో ప్రమాదాలు జరుగు తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోకపోవడం విచారకర మన్నారు. చెరువు కట్టను వెడల్పు చేసి, రక్షణ గోడలు (రెయిలింగ్) నిర్మించి ప్రమా దాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గూడూరి నరోత్తమ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు మేకల చొక్కారెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చెరుకు వెంకటేశం, రాష్ట్ర నాయకులు సురకంటి రంగారెడ్డి, జిల్లా నాయకులు ఏనుగు అలివేలు, పల్లెకాడి బసవయ్య, బైరు వెంకటేశం, కేసారం కృష్ణారెడ్డి, రచ్చ సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షులు ఇటమని అంజయ్య, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఉప్పునూతల నరసింహ, రామిడి యాదిరెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు లింగం యాదవ్, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

టీజీఈ హైట్స్‌ను సందర్శించిన కలెక్టర్ దివాకర టి.ఎస్



ఖమ్మం, (జనంసాక్షి) :
ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీజీఈ హైట్స్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి గురువారం ఉదయం సందర్శించారు. రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి ప్రాంగణమంతా కలియతిరిగి పరిశీలించారు. హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా హౌసింగ్ సొసైటీకి కేటాయించిన ఈ గేటెడ్ కమ్యూనిటీకి ప్రభుత్వపరంగా కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలను కలెక్టర్ అధికారులను, సొసైటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూర్తిస్థాయిలో సిద్ధం చేసిన మోడల్ ఫ్లాట్‌ను సందర్శించి నిర్మాణ తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కొండపల్లి శేషు ప్రసాద్, డాక్టర్ విజయ్ కుమార్, టీఎన్జీవోస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస రావు, ఖమ్మం జిల్లా టీజీవో అధ్యక్ష, కార్యదర్శులు కొంగర వెంకటేశ్వర రావు, మోదుగు వేలాద్రి, రాష్ట్ర బాధ్యులు సూరంపల్లి రాంబాబు, టీఎన్జీవోస్ యూనియన్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు యర్రా రమేష్, జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, ఏలూరి కోణార్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



రామన్నపేట, నవంబర్ 19 (జనంసాక్షి):
తనకు కొడుకు లేకున్నా అల్లారు ముద్దుగా పెంచుకున్న తన కూతురే తన ఆస్తిగా భావించిన తండ్రికి తలకోరివి పెట్టి అందరి హృదయాలను కలచి వేసిన సంఘటన రామన్నపేట మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పట్టణ కేంద్రానికి చెందిన లవణం దశరథ (63) ఆటో డ్రైవర్ గా పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఇతనికి భార్య పుష్పతో పాటు ముగ్గురు కుమార్తెలు శ్వేత, స్వప్న, లలితలు ఉన్నారు. ఆటో డ్రైవర్ గా పనిచేస్తూనే వారి వివాహాలు చేశాడు.తన చిన్న కుమార్తె దగ్గరకు బుధవారం యాదగిరి గుట్టకు వెళ్లాడు. అక్కడే గుండె నొప్పి రావడంతో వారు భువనగిరి దవాఖానాకు తీసుకెళ్లగా డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు.దీంతో పెద్ద కూతురు శ్వేత ముందు నడిచి తండ్రికి తలకోరివి పెట్టింది. కొడుకులు లేకున్నా తన తండ్రికి ఎలాంటి లోటు రాకుండా కూతురు తలకోరివి పెట్టడంతో పాటు అన్ని కార్యక్రమాలు ముందుండి కూతుర్లు చేయడంతో బంధువుల, గ్రామస్తుల కండ్లు చెమర్చాయి.

చలో సిద్ధిపేటకు బయలుదేరిన పోచంపల్లి కాంగ్రెస్ నాయకులు



భూదాన్ పోచంపల్లి, (జనంసాక్షి):
సిద్ధిపేటలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో సిద్ధిపేట బహిరంగ సభకు భూదాన్ పోచంపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు గోరంటి శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు బోదాసు ఈదయ్య, పడాల సతీష్ చారి, కంటే లింగస్వామి, ఉపాధ్యక్షులు కాసుల బాలకృష్ణ, సర్పంచ్‌లు మచ్చ శ్రీనివాస్, చుక్క శోభ శంకర్, గ్రామ శాఖ అధ్యక్షులు గుండ్ల మహేష్, సింగం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవు: కలెక్టర్ బి. చంద్రశేఖర్

45వ డివిజన్‌లో ఘటనపై కలెక్టర్, మేయర్ తీవ్ర స్పందన.. బాధితురాలికి ఆసుపత్రిలో చికిత్స



నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 19, (జనంసాక్షి):నగర పరిశుభ్రత కోసం విధులు నిర్వహిస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి ఘటన నల్లగొండలో కలకలం రేపింది. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్‌లో విధుల్లో ఉన్న సందుపట్ల రమణమ్మపై బాలకృష్ణ అనే వ్యక్తి కర్రలతో దాడికి పాల్పడిన ఘటనపై ఆమె ఫిర్యాదు చేసారు అలాగే తన పని లో తాను ఉండగా అతను కర్రతో దాడి చేసినట్లు జనం సాక్షి తో తెలిపారు.ఇదే విషయమై విషయం తెలిసి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పందించారు. దాడి ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా యంత్రాంగం నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వెల్లడించింది.ఘటనపై సమాచారం అందిన వెంటనే కలెక్టర్ స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను పూర్తి వివరాలు సమర్పిం చాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎన్నో ఇబ్బం దులను ఎదుర్కొంటూ విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులపై దాడులకు పాల్పడటం బాధాకరమని కలెక్టర్ పేర్కొన్నారు. విధుల్లో ఉన్న కార్మికులపై ఎవ రైనా దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. మరోవైపు ఈ ఘటనను నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అఫ్రోజ్ అలీ మహమ్మద్ తీవ్రంగా ఖండించారు.

మిగతా 4లో

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

నల్లజెండాలతో టీజేఎఫ్ ప్రదర్శన



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 19 (జనంసాక్షి)
ఖమ్మం జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రత్యక్ష పోరాటం కొనసాగిస్తున్న టియుడబ్ల్యూజే (టీజేఎఫ్) ఇవాళ (గురువారం) వినూత్న తరహాలో నిరసన తెలిపింది. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి చిర్రా రవి నేతృత్వంలో నల్ల చొక్కాలు ధరించి, నల్ల జెండాలు చేత పట్టిన జర్నలిస్టులు.... వీ వాంట్ హౌస్ సైట్స్ అంటూ నినదించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, జర్నలిస్టు ఇండ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కు తమ మొర వినిపించారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు చొరవ చూపించాలని, ఇప్పటికే మంజూరై ఉన్న 23 ఎకరాల భూమిని సొసైటీకి బదిలాయించడం ద్వారా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు స్థలం పంపిణీ చేయాలని టీజేఎఫ్ డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదుపరి ఖమ్మం పర్యటనలోనే ఇళ్ల స్థలాల పంపిణీకి శ్రీకారం చుట్టాలని టీజేఎఫ్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్లు మంజూరు చేయాలి

టిటిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహా

రామన్నపేట, నవంబర్ 19 (జనంసాక్షి):
అర్హులైన పేదలందరికీ చేయూత పెన్షన్లు మంజూరు చేయాలని, తిరస్కరించిన దరఖాస్తులను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నిర్మలానరసింహా నేత ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా రామన్నపేట ఎంపీడీవో ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేయూత పెన్షన్ల దరఖాస్తులను చిన్నచిన్న కారణాలు చూపుతూ నిరాకరించడం పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడమేనని ఆయన అన్నారు.నేటి పరిస్థితుల్లో జీవనోపాధి కోసం కొందరు పాత కార్లను కొనుగోలు చేసి రవాణా పనులకు ఉపయోగించుకుంటున్నారని, అలాగే పాత ట్రాక్టర్లు కలిగి ఉన్నా వాటిని వ్యవసాయం, ఉపాధి అవసరాల కోసం వినియోగిస్తున్నారని తెలిపారు. అటువంటి వాటిని విలాసవంతమైన ఆస్తులుగా పరిగణించి పెన్షన్లను నిరాకరించడం సమంజసం కాదన్నారు. ఒక చిన్న స్థలం లేదా పాత వాహనం ఉన్నంత మాత్రాన వారు ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నారని భావించడం సరికాదని పేర్కొన్నారు.అధికారులు కేవలం నిబంధనలు, రికార్డుల ఆధారంగా కాకుండా,



క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వాస్తవ ఆర్థిక పరిస్థితులను పరిశీలించాలని కోరారు. వారి వద్ద ఉన్న ఆస్తులు విలాసాల కోసం వినియోగిస్తున్నారా, లేక కుటుంబ జీవనోపాధి కోసం ఉపయోగిస్తున్నారా అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. 2023 కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని 34వ పేజీ, 24వ అంశంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నప్పటికీ ఎలాంటి షరతులు లేకుండా పెన్షన్లు అందిస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ప్రస్తుతం పేదల దరఖాస్తులపై అనేక ఆంక్షలు విధించడం, చిన్నచిన్న కారణాలతో తిరస్కరించడం బాధాకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మిర్జా ఫజల్ బేగ్, సిరిపురం మాజీ సర్పంచ్ రాపోలు నిర్మల, నాయకులు పోచబోయిన మల్లేశం, సిరిపురం చేనేత సహకార సంఘం మాజీ కార్యదర్శి రాపోలు యాదగిరి, వడ్లకొండ సత్తయ్య,గజం నరసింహ, గూడెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవు

కలెక్టర్ బి. చంద్రశేఖర్

ఘటన తెలిసిన వెంటనే మేయర్, డిప్యూటీ మేయర్, శానిటరీ సూపర్‌వైజర్, మున్సిపల్ సిబ్బంది స్పందించి బాధితురాలు రమణమ్మను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు.నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవంగా వ్యవహరించాలని మేయర్ సూచించారు. ముఖ్యంగా మహిళా కార్మికులపై దాడులకు పాల్పడటం సహించరాని విషయమని పేర్కొన్నారు. కార్మికుల భద్రతకు మున్సిపల్ కార్పొరేషన్ పూర్తి బాధ్యత వహిస్తుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



రైతులకు కూరగాయల మినీ కిట్ల పంపిణీ

పంట మార్పిడితో అధిక లాభాలు పొందాలి

గుర్రంపోడు: నవంబర్ 19 (జనంసాక్షి)
గుర్రంపోడు మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఏడు రకాల కూరగాయల విత్తనాలతో కూడిన మినీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనుముల క్లస్టర్ ఉద్యాన అధికారి మురళి మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంట మార్పిడి విధానంలో కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. తక్కువ నీటితో కూరగాయలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని, ఉద్యాన శాఖ అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని సాగు ఖర్చులను తగ్గించుకోవాలని కోరారు.మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి మాట్లాడుతూ నీటి కుంటలను నిర్మించుకొని వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలైన మినుములు, నువ్వులు, కుసుమ పంటలను సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండెబోయిన కళావతి సత్యనారాయణ, అనుముల క్లస్టర్ ఉద్యాన అధికారి మురళి, మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి, ఉద్యాన విస్తరణ అధికారి రాంప్రసాద్, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పోరాటంతోనే నిద్రపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మేలుకాలుపు!

ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పీజీఆర్ ఘాటు విమర్శలు

గుర్రంపోడు: నవంబర్ 19 (జనంసాక్షి)



గుర్రంపోడు మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులు, నాగార్జునసాగర్ నీటి సమస్య, కొత్త పెన్షన్ల మంజూరు తదితర ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పీజీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తూ ప్రభుత్వాన్ని నిలదీయడంతోనే నిద్రపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు తదితర నాయకులు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోరాటం చేస్తున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని పీజీఆర్ విమర్శించారు..రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధర, కొనుగోలు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్రంపోడు మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులు, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రతిపక్షం ప్రశ్నిస్తున్నప్పుడు సమాధానం చెప్పలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని పీజీఆర్ మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని, వికలాంగులకు రూ. 6,000 పెన్షన్, రైతులకు గిట్టుబాటు ధర, మహిళలకు స్కూటర్లు, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అన్ని హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి

సర్పంచ్ స్వప్న భాస్కర్

గుర్రంపోడు: నవంబర్ 19 (జనంసాక్షి)
నాగార్జునసాగర్ నియోజకవర్గం, గుర్రంపోడు మండలం, తెరాటి గూడెం గ్రామంలో చేయూత పెన్షన్ లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జక్కుల స్వప్న భాస్కర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్ ధ్రువపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ జక్కుల స్వప్న భాస్కర్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు గుండ్రెడ్డి చిన్న వెంకటరెడ్డి, శివార్ల భాస్కర్, భీమనబోయిన పెద్ద సైదులు (అబ్బాస్), కన్నెబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ముందుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

భద్రయ్య మృతదేహానికి నివాళులర్పించిన సిపిఎం నాయకులు

రామన్నపేట, నవంబర్ 19 (జనంసాక్షి):
రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణ సంఘం మాజీ జిల్లా నాయకులు రాచమల్ల భద్రయ్య అనారోగ్యంతో మృతి చెందడం పట్ల సిపిఎం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భద్రయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ సర్పంచ్ బోయిన ఆనంద్, మాజీ ఎంపీపీ నాగటి ఉపేందర్ మాట్లాడుతూ రాచమల్ల భద్రయ్య మరణం నీర్నేముల గ్రామానికి, నాయి బ్రాహ్మణ సంఘానికి తీరని లోటని అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి నాగటి లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు బండా జగన్మోహన్ రెడ్డి, నేమనంది లింగయ్య, మునుగోటి అత్తయ్య, వార్డు సభ్యులు నాగటి ఉపేందర్, మాజీ వార్డు సభ్యులు నాగటి మహేష్, పాల్వాయి చంద్రశేఖర్ రెడ్డి, నాగటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ యాదవ్

హాలియా జనం సాక్షి నవంబర్ 19

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిరస్పరిణి యనీ అని అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం హాలియాలో ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె విగ్రహానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గరీబ్ట టాహు అనుచు పేదలకు అనేక మౌలిక సదుపాయాలు కల్పించి భారతదేశాన్ని ప్రగతి పదములో నడిపించిన ఉక్కు మహిళ అని. ఒకప్పుడు ఇందిరానే ఇండియా నే ఇందిరా అనేవారని ఆమె సేవల ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి. మాజీమార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి కౌన్సిలర్లు రాజా రమేష్ యాదవ్ చెరుపల్లి ముత్యాలు ప్రసాద్ నాయక్ కుందూరు వెంకటరెడ్డి బొంగరాల యేసు రాజు కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్ పిల్లి ఆంజనేయులు మజ హార్ మైనుద్దీన్ ఆలియా పట్టణ కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు వెంపటి శ్రీనివాసు పాల్గొన్నారు

చట్టాలపై అవగాహనే.. బాలలకు రక్షణ కవచం

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై సెయింట్ మేరీస్ విద్యార్థులకు అవగాహన కల్పించిన సీనియర్ సివిల్ జడ్జి కె. అనిత

దేవరకొండ, నవంబర్ 19(జనంసాక్షి)

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం దేవరకొండలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి కె. అనిత ముఖ్య అతిథిగా హాజరై జాతీయ గీతం ఆలపించి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావాలు, సామాజిక సమస్యల గురించి వివరించారు. యువత, పిల్లలు, మహిళలు, మాదక ద్రవ్యాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి అందుబాటులో ఉన్న చట్టపరమైన సహాయం, న్యాయ సేవలపై అవగాహన కల్పించారు.అనంతరం బాలికలు, చిన్నారుల రక్షణ కోసం రూపొందించిన పోక్సో చట్టంలోని ముఖ్యమైన అంశాలను వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాలను తెలియజేస్తూ, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బల్లా నక్షత్రం మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక బాధ్యత, వ్యక్తిగత భద్రత, చట్టాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో చట్టాల పట్ల అవగాహన పెంచుతాయని తెలిపారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నాయిల ఉమామహేశ్వర్, కోర్టు సీనియర్ సూపరిండెంట్ శ్యామ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







ఉచిత కూరగాయల విత్తనాల పంపిణీ

ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి: ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, నవంబర్ 19 (జనంసాక్షి):

రైతుల సంక్షేమం, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచితంగా కూరగాయల విత్తనాలను పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం దేవరకొండ వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు రూ. 1,000 విలువైన 650 గ్రాముల కూరగాయల విత్తనాల మినీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఆసరా పెన్షన్

పెన్‌పహాడ్, నవంబర్ 19 (జనంసాక్షి) :

మండల పరిధిలోని గాజుల మల్కాపురం గ్రామంలో గురువారం ప్రజా సంక్షేమ సంబరం అంబరాన్నంటింది. గ్రామ సర్పంచ్ నాతాల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన 'చేయూత' పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు, సర్పంచ్ నాతాల వెంకట్ రెడ్డితో కలిసి 25 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ప్రభుత్వ చేయూత అందడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. నిరుపేదల ఆర్థిక భరోసా కోసమే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒగ్గు రవి, ఉపసర్పంచ్ సొంటి ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి లావణ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీరాములు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ పిన్నేని కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బండి రామకృష్ణారెడ్డి, నాయకులు దొంతగాని గోపయ్య, బండి మధుసూదన్ రెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, బండి రవీందర్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి బీఎస్పీ మండల అధ్యక్షుడు నకిరేకంటి నరేష్

రామన్నపేట, నవంబర్ 19 (జనంసాక్షి):

రామన్నపేట మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్న ఏనుగ శ్రీశైలం గురువారం ఉదయం రోజు మాదిరిగా తన ఆటోతో బయలుదేరగా, రామన్నపేట – చిట్యాల మార్గమధ్యలో లారీతో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయారు.కుటుంబ పోషణ కోసం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న శ్రీశైలం మృతితో ఆయన కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని బీఎస్పీ మండల అధ్యక్షుడు నకిరేకంటి నరేష్ వ్యక్తం చేశారు.ఈ ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఒక్కో కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించడంతో పాటు బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రోగులకు అల్పాహారం పంపిణీ

దేవరకొండ, నవంబర్ 19 (జనం సాక్షి):

భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని దేవరకొండ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు, పేదల అభ్యున్నతికి చేపట్టిన కార్యక్రమాలను స్మరించుకున్నారు. పేదలకు సేవ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఎమ్మెల్యే ఆరా

దేవరకొండ, నవంబర్ 19 (జనం సాక్షి):

దేవరకొండ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు, మందుల లభ్యత, మౌలిక వసతులపై వైద్యులను వివరాలు అడిగారు. పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించకుండా అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.

పశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్

చింతలపాలెం(జనంసాక్షి)

చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో, జువారి సిమెంట్ లిమిటెడ్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని జిల్లా పశుసంవ ర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పశువుల పెంపకంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, మేత మరియు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపితే పాడి పరిశ్రమ ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని,పశువులను రైతులు భారంగా భావించరాదని, వాటికి నాణ్యమైన పోషకాహారం అందిస్తూ,క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తే పాడి పరిశ్రమ లాభదాయకంగా మారుతుందని తెలిపారు.పశుపోష ణలో ఆధునిక మెళకువలు,పశువుల ఆరోగ్య సంరక్షణపై రైతులకు అవసరమైన అవగాహన కల్పించేం దుకు పశుసంవర్ధక శాఖ కట్టుబడి ఉందన్నారు.గ్రామ సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య మాట్లాడుతూ పశు వైద్యశా ల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందేలా అధికారులు చర్యలు తీసు కోవాలని కోరారు.రైతులందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మను షులకు పోషక విలువలతో కూడిన ఆహారం ఎంత అవసరమో,పశువు లకు కూడా అంతే అవసరమని పేర్కొన్నారు.జువారి సిమెంట్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల సీనియర్ అధికారి డాక్టర్ కరణం లుగేంద్ర పిళ్లై మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం ద్వారా రైతులు తమ పశువుల ఆరోగ్య సమస్యలను పరిష్కరించు కునే అవకాశం కలుగుతుందని తెలి పారు.పశుపోషకులు పశువైద్యులతో పాటు సంబంధిత సంస్థలతో సమన్వయం పెంచుకొని,తగిన అవగాహనతో పశుపోషణ చేపట్టాల ని సూచించారు.సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జువారి సిమెంట్ సీఎస్ఆర్ నిధులతో ఈ శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పరిశోధన ద్వారా అభివృద్ధి చేసిన ఓట్స్ గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.రైతులు తమ పొలాల్లో పశుగ్రాస పంటలను సాగు చేసుకొని పశువులకు నాణ్యమైన మేత అందించాలని నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య,ఉప సర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి,కోదాడ ఏరియా అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య,పశువై ద్యాధికారులు మధు,ఉషారాణి, కావుగళ్ల శైలజ తదితరులతో పాటు సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎస్. నాగబ్రహ్మ చారి,రవి,రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.రైతులకు ఉపయోగపడే విధంగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించిన అధికారులకు,సంస్థ ప్రతినిధులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.





ట్రాక్టర్ బోల్తా పడి ఒరిస్సా వలస కార్మికుడు మృతి

మోటకొండూరు, నవంబర్ 19(జనం సాక్షి):

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఉన్న ఇటుక బట్టీల వద్ద ఘోర విషాదం చోటుచేసుకుంది. ఇటుక బట్టీ వద్ద పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు,తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బేణుధర్ పుంజి (22), కాటేపల్లి శివారులోని ఇటుక బట్టీ వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఇటుకలు తయారు చేసే క్రమంలో గ్రిల్ ఉన్న ట్రాక్టర్‌తో ఎర్రమట్టిని తొక్కిస్తున్నాడు. ఈ సమయంలో అకస్మాత్తుగా ట్రాక్టర్ అదుపుతప్పి ఆ యువకుడిపైకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా; గాయపడిన బాధితుడు మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పొట్టకూటి కోసం వలస వచ్చి యువకుడు ఇలా మృత్యువాత పడటంతో స్థానికంగా తీవ్ర విషాదం అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

పోచంపల్లి అర్బన్ బ్యాంక్‌కు జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు

ఎన్‌పీఏ మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రతిష్ఠాత్మక పురస్కారం

న్యూఢిల్లీలో అవార్డు అందుకున్న చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్

రూ.400.99 కోట్లకు చేరిన బ్యాంకు డిపాజిట్లు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 19 (జనం సాక్షి) :

న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఇండియన్ కో-ఆపరేటివ్ సమ్మిట్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఎక్స్‌లెన్స్ ఇన్ ఎన్‌పీఏ మేనేజ్‌మెంట్ విభాగంలో ఈ అవార్డును నాబార్డ్ డైరెక్టర్, ఆర్‌బీఐ మాజీ డైరెక్టర్ సతీష్ మరాఠే, ఎన్‌ఏఫ్‌సీయూబీ చైర్మన్ లక్ష్మీదాస్ చేతుల మీదుగా పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, బ్యాంక్ సీఈవో సీత శ్రీనివాస్ అందుకున్నారు. ?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు జాతీయ బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు అధునాతనమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లు రూ.400.99 కోట్లుగా, మంజూరు చేసిన రుణాలు రూ.291.98 కోట్లుగా ఉన్నాయని వెల్లడించారు. ఖాతాదారులందరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సరం బ్యాంక్ అవార్డులను గెలుపొందడం పట్ల బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరిశంకర్, సూరెపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, బిట్టు భాస్కర్, మక్తాల నర్సింహా, బ్యాంకు వ్యవస్థాపకులు, ఖాతాదారులు, వాటాదారులు, శ్రేయోభిలాషులు, బ్యాంక్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



వీఆర్ఓ భూముల విక్రయాలపై విచారణ జరపాలి

186 మంది మాజీ ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలి: ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతి



దేవరకొండ, నవంబర్ 19 (జనంసాక్షి):

తెలంగాణ గ్రామీణ పునర్నిర్మాణ సంస్థ (వీఆర్ఓ)కు చెందిన భూముల విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సంస్థ పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సమితి అధ్యక్షుడు వర్కల వెంకటేష్ ఆధ్వర్యంలో బాధితులు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. 1983 నుంచి సంస్థలో పనిచేసి ఉపాధి కోల్పోయిన 186 మంది మాజీ ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. 2021 నుంచి సంస్థకు చెందిన 100 ఎకరాలకు పైగా భూములను అక్రమంగా విక్రయించి, సుమారు రూ.220 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు వినతిపత్రంలో ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. అక్రమంగా విక్రయించిన భూములను తిరిగి సంస్థకు అప్పగించాలని, ప్రతి బాధిత కుటుంబానికి 120 గజాల ఇంటి స్థలం, పక్కా ఇల్లు, రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. మాజీ ఉద్యోగులకు తిరిగి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు వర్కల వెంకటేష్‌తో పాటు మాజీ ఉద్యోగులు, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన సూర్యాపేట పట్టణమే లక్ష్యం

సూర్యాపేట (జనంసాక్షి):



పట్టణంలోని రద్దీ ప్రాంతాలకు వచ్చే ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆధునిక సౌకర్యాలతో పబ్లిక్ టాయిలెట్లు నిర్మిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్మించిన ఆధునిక పబ్లిక్ టాయిలెట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలనే లక్ష్యంతో సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. జనసమర్ధ ప్రాంతాల్లో బహిరంగ మలమూత్ర విసర్జనను నివారించడంతో పాటు మహిళలకు ప్రత్యేకంగా సౌకర్యవంతమైన వసతులు అందించాలనే ఉద్దేశంతో నూతన పబ్లిక్ టాయిలెట్లను నిర్మించినట్లు చెప్పారు. పట్టణ పరిశుభ్రత అనేది కేవలం మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. పబ్లిక్ టాయిలెట్లను పరిశుభ్రంగా వినియోగించుకోవాలని, పరిసరాల్లో చెత్తాచెదారం వేయకుండా పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని అన్నారు. స్వచ్ఛమైన సూర్యాపేట నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హనుమంతరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ కింద మున్సిపల్ కార్యాలయంలో, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, నూతన వ్యవసాయ మార్కెట్‌లో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించినట్లు తెలిపారు. ఇప్పటికే పట్టణంలో ఉన్న 18 పబ్లిక్ టాయిలెట్లకు అదనంగా కొత్తగా నాలుగు ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు కొణతం రాజేష్‌రెడ్డి,గండూరి రమేష్, గుణగంటి హేమ, మున్సిపల్ ఈఈ కిరణ్, డీఈ ప్రణయ్‌రెడ్డి, ఏఈ తిరుమలయ్య, ఆర్వో జ్ఞానేశ్వరి, జూనియర్ అసిస్టెంట్లు యాదగిరి, ఎస్ఎస్ఆర్.ప్రసాద్, రంజిత్, ఎస్.డి.సమ్మి , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించినతిప్పన విజయసింహారెడ్డి

మాడుగులపల్లి. నవంబర్.19. (జనంసాక్షి):



మండల పరిధిలోని ఇసుకబావిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మొల్లాల వెంకట్ రెడ్డి మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి వారి నివాసంలో కుటుంబ సభ్యులు మొల్లాల శ్రీనివాస్ రెడ్డి అప్ప రెడ్డి లను పరామర్శించారు అనంతరం మృతుడికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి ఆత్మ శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, మాజీ చైర్మన్ జెరిపోతుల రాములు గౌడ్, ఉపసర్పంచ్ వల్లపు దాసు సంధ్య చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు తంగెళ్ల సీతారాంరెడ్డి, వార్డు సభ్యుడు రాచూరి వెంకటయ్య వార్డ్ మెంబర్ పుట్ట లక్ష్మి శ్రీనివాస్, మంచికంటి అమృత రెడ్డి, మంచికంటి శ్రీనివాస్ రెడ్డి, కట్ట ఆదిరెడ్డి, జిన్నా వెంకట్ రెడ్డి, మొల్లాల శ్రీనివాస్ రెడ్డి, మల్లాల మట్టారెడ్డి, పోతురాజు యాదయ్య, మొల్లాల ఉపేందర్ రెడ్డి, పోతురాజు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు క్రిష్ణవేణి విద్యార్థి ఎంపిక

రామన్నపేట, నవంబర్ 19 (జనంసాక్షి):

రామన్నపేట పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి ఏళ్ల శ్రీవిద్య జాతీయ స్థాయి స్పీడ్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్పీడ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం చిట్యాల లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీవిద్య జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ లో డిసెంబర్ 20, 21, 22 తేదీలలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో తెలంగాణ జట్టు తరఫున ఆమె పాల్గొంటుందని ఆయన తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీవిద్యను, ఆమెకు శిక్షణ ఇచ్చిన పి ఈ టి కల్పన ను గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ నరేందర్ రెడ్డి తో పాటు ప్రిన్సిపాల్ బి సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జెవిఎన్ఎస్ మణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రషీద్, మురళి, అలీమోద్దీన్, సత్తయ్య, ఉమారాణి, పూనందాస్, వినోద, ఆసియా, లావణ్య, మహాలక్ష్మి, శ్రావణి, విజయలక్ష్మి, మమత, చైతన్య ,మానస, శైలజ తదితరులు అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

అంగడిపేటలో బుర్ర యాదయ్య-వెంకటమ్మ దంపతుల నూతన గృహప్రవేశం



పి.ఏ.పల్లి,నవంబర్ 19 (జనంసాక్షి):

పి.ఏ.పల్లి మండలంలోని అంగడిపేట గ్రామంలో బుర్ర యాదయ్య, వెంకటమ్మ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి.ఏ.పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నెర్మటి సతీష్ రెడ్డి,డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి,మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్ రెడ్డి హాజరై నూతన గృహంలోకి ప్రవేశించిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తోందని అన్నారు. అర్హులైన నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ధన్ సింగ్,మాజీ సర్పంచ్ వంగాల వెంకట్ రెడ్డి,సీనియర్ నాయకులు వీరమళ్ల పరమేష్,ఉప సర్పంచ్ వీరమళ్ల యశోద?సతీష్,గ్రామ శాఖ అధ్యక్షుడు వడ్లపల్లి శేఖర్ రెడ్డి,మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ అక్బర్,గ్రామ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు

○ విద్యార్థులు లక్ష్య సాధనకు కష్టపడి చదవాలి ○ ఐటీడీఏ పీవో బి.రాహుల్
○ చదువుకు ఆర్థిక చేయూత అందించడం అభినందనీయం



భద్రాచలం నవంబరు 19 (జనంసాక్షి): విద్యార్థినీ విద్యార్థులు బాధ్యతతో చదువుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకు నిరంతరం శ్రమించాలని అన్నారు. విద్యార్థుల చదువుకు ఆర్థికంగా చేయూత అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీవో బి.రాహుల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థి జీవితంలో కీలకమైన దశ అని, ఈ పరీక్షల్లో సాధించిన మంచి మార్కులు భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర ఉన్నత విద్యా కోర్సుల్లో రాణించాలంటే ఇప్పటి నుంచే క్రమశిక్షణతో చదవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఆర్థిక ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. ఈ నగదు సహాయాన్ని ఇతర అవసరాలకు వినియోగించకుండా విద్యాభ్యాసానికే ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లోనూ ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారని, వారికి సైతం ఇలాంటి ప్రోత్సాహకాలు అందించాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. అనంతరం నియోజకవర్గ స్థాయి టాపర్లుగా నిలిచిన అశ్వారావుపేటకు చెందిన కందుకూరి పూజిత, పినపాకకు చెందిన గొంజి జేష్మ రమణిక, కొత్తగూడెంకు చెందిన చాణకుల లక్ష్మీ రమణికలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. అలాగే 23 మండలాల స్థాయి టాపర్లకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున ప్రోత్సాహక నగదు అందించారు.

వచ్చే ఏడాది జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించే విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించనున్నట్లు ప్రకటిస్తూ రూపొందించిన గోడపత్రికను పీవో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ చందన, జేడీఎం హరికృష్ణ, శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ డీజీఎం సతీష్, ఏరియా మేనేజర్ ఉపేందర్, సిబ్బంది అరుణ్ కుమార్, ఆనంద్ కుమార్, నవీన్, కిరణ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఛాంబర్ ఎన్నికలు నిబంధనల ప్రకారమే నిర్వహించాలి

- ఏకపక్ష నిర్ణయాలకు తావులేదు.. రిజిస్టర్డ్ కమిటీలో అందరికీ హక్కులున్నాయి
- ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు పాటించాల్సిందే - వ్యాపార వర్గాలు ఐక్యంగా ఉండాలి
- రావులపల్లి రాంప్రసాద్



భద్రాచలం నవంబరు 19 (జనంసాక్షి)

భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహించాలని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా, రిజిస్టర్డ్ కమిటీలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల నిర్వహణపై గత పదేళ్లుగా సందిగ్ధత కొనసాగడం విచారకరమని పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి చోటుచేసుకుంటున్న పరిణామాలు ఒక వర్గానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లుగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ పూర్తయి, ఎన్నికల గుర్తులు కేటాయించే సమయంలో కొందరిని పోటీ నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించడం సమంజసం కాదన్నారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో సంస్థల ఎన్నికలను చూశానని, ఇలాంటి విచిత్రమైన పరిణామాలు ఎక్కడా చూడలేదని వ్యాఖ్యానించారు. రిజిస్టర్డ్ కమిటీలోని సభ్యులందరికీ సమాన హక్కులు ఉంటాయనే విషయాన్ని ఎన్నికల నిర్వహకులు గుర్తించాలని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలోనే కొన్ని అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ ఆరోపించారు. రిజిస్టర్డ్ సంస్థకు ఎన్నికలు నిర్వహించే సమయంలో రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుందని, అటువంటి చర్యలు చేపట్టకపోవడం ఎన్నికల కమిటీ అవగాహనలోపాన్ని సూచిస్తోందని విమర్శించారు. ఎన్నికల నిబంధనలను అడుగడుగునా ఉల్లంఘిస్తూ, తమకు అనుకూలమైన వారిని గెలిపించు కునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా యనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయని పేర్కొన్నారు. వ్యాపార వర్గాలన్నీ విజ్ఞతతో ఆలోచించి, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వ్యాపారుల మధ్య విభేదాలు పెరగకుండా అందరూ ఐకమత్యంతో కలిసిమెలిసి ఉండాలని రావులపల్లి రాంప్రసాద్ ఆకాంక్షించారు.

వంటావార్పు కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి



సూర్యాపేట(జనంసాక్షి):

సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ లక్ష్యంగా కొనసాగుతున్న ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 21న నిర్వహించే వంటావార్పు వంటావార్పు కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఉద్యమ కమిటీ సభ్యులు కోరారు.గురువారం జిల్లా కేంద్రంలోని హోటల్ శ్రీగ్రాండ్ లో జరిగిన అఖిలపక్ష ఉద్యమ సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.పట్టణంలోని వర్తక, వాణిజ్య, వ్యాపార, కుల, రాజకీయ,ఉద్యోగ, విద్య, యువజన, మహిళ, కార్మిక సంఘాలు సెంటర్ల వారీగా ఎంపిక చేసుకున్నారని తెలిపారు.ఉదయం 8 గంటల నుండే వంటా వార్పు కార్యక్రమం ప్రారంభించాలని తెలిపారు.వంటావార్పు నిరసన కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంతో పాటు కేంద్ర ప్రభుత్వం వరకు చేరుకోవాలని అన్నారు. జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కొనసాగించాలని డిమాండ్ ను గట్టిగా తెలియజేయాలని తెలిపారు.సెంటర్ల వారీగా ఉద్యమ సభ్యులు పర్యవేక్షణ కమిటీలను ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ కో కన్వీనర్లు పెద్దిరెడ్డి రాజా, సలహాదారు రమణాచారి,ధర్మార్జున్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, చల్లమల్ల నరసింహ, మండారి డేవిడ్ కుమార్, కొత్తపల్లి శివకుమార్, వెలుగు వనిత, అనంతుల మధు,భూపతి రాములు,మట్టిపెల్లి సైదులు, గంట నాగయ్య, సకినాల కృష్ణ, జీడి భిక్షం, పందిరి మాధవరెడ్డి, జలగం మల్లేష్, నేరెళ్ల మధు, ఎరకచర్ల శోభారాణి, విజయమ్మ, సట్టు నాగయ్య, పోలేబోయిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నీరు పేదలకు అండగా చేయుత: సర్పంచ్ స్వర్ణ

చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ



పెన్ పహాడ్ నవంబర్ 19 (జనం సాక్షి):

నీరు పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండేందుకు చేయూత పింఛన్లను మంజూరు చేయడం జరిగిందని సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి అన్నారు మండలంలోని లింగాల గ్రామంలో వివిధ రకాల చేయూత పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి ప్రభుత్వం మంజూరు చేసిన అనుమతి పత్రాలను పంచాయతీ కార్యదర్శి చెరుకుపల్లి జానయ్యతో కలిసి గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంపిణీ చేసి మాట్లాడారు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 5 లక్షలకు పైగా అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని అందులో భాగంగా గ్రామంలో దరఖాస్తు చేసుకున్న 59 మందికి చేయూత పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు ఈ అవకాశాన్ని పించన్ దారులు సద్వియోగం చేసుకొవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రణపంగ లచ్చయ్య,వార్డు సభ్యులు మల్లెపల్లి సారిక,చింత ముత్తయ్య, నాయకులు నల్లపు శ్రీనివాస్, జూకూరి అంజయ్య, మల్లెపల్లి దుర్గారావు,సుంకరి నాగభూషణం, పింఛన్ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు...

చారిత్రక వారసత్వ సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యత

దేవరకొండ ఖిల్లా పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం



దేవరకొండ, నవంబర్ 19 (జనంసాక్షి):

చారిత్రక కట్టడాలు ఒక ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, వైభవానికి ప్రతీకలని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నల్గొండ జిల్లా ఇంటాక్ చాప్టర్ అధ్యక్షుడు లయన్ సముద్రాల ధనంజయ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటాక్, పురావస్తు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం దేవరకొండలోని గాంధీ విగ్రహం నుంచి ఖిల్లా దుర్గం వరకు విద్యార్థులతో వారసత్వ నడక నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి జెండా ఊపి నడకను ప్రారంభించారు. విద్యార్థులు 'మన చరిత్ర ? మన ఊరు', 'వారసత్వ సంపదను కాపాడాలి' అనే నినాదాలతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ దేవరకొండ ఖిల్లాలోని ప్రతి నిర్మాణానికి ప్రత్యేక చారిత్రక నేపథ్యం ఉందని, ప్రజల భాగస్వామ్యంతోనే పురాతన కట్టడాలను పరిరక్షించగలమని తెలిపారు. ఇంటాక్ సభ్యుడు ముసిని అంజన్ మాట్లాడుతూ ఖిల్లాలోని శిల్పాలు, శాసనాలు, పురావస్తు అవశేషాలు ఈ ప్రాంత చారిత్రక, సాంస్కృతిక వైభవానికి నిదర్శనమన్నారు. దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ అధికారి శక్రు నాయక్, ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా, నల్గొండ జిల్లా అధ్యక్షుడు బండి నరేష్, మాజీ అధ్యక్షుడు తడకమళ్ళ బిక్షమయ్య, ఆల్తాఫ్, గార్లపాటి శ్రీను, అంకురి ప్రసాద్, పగిడిమర్రి యాదగిరి, బత్తుల సురేష్, పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు చెరుపెల్లి జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సంఘీశెట్టి జోత్స్న, గంజి యాదమ్మ, మునగపాటి చంద్రకళ వివిధ పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ:సర్పంచ్ పార్వతమ్మ రమేష్



మాడుగులపల్లి నవంబర్19, (జనంసాక్షి):

మండల పరిధిలోని తోపుచర్ల గ్రామంలో గురువారం నాడు సర్పంచ్ నన్నెబోయిన పార్వతమ్మ రమేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు మంజూరైన చేయూత పింఛన్ పత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని తెలిపారు లబ్ధిదారులు ఈ పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి పూసపాటి నరేష్, ఉప సర్పంచ్ వల్లపు నరేష్, వార్డు సభ్యులు వల్లభ దాస్ వేణు, మురుసు సతీష్, కనకయ్య, బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు వల్లపు వీరన్న, రాచూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

❍ ఇరువర్గాలు పట్టుదలకు పోకుండా చర్చలతో సమస్యను పరిష్కరించుకోవాలి

❍ వ్యాపారుల ఐక్యతకు ప్రాధాన్యమివ్వాలి ❍ పుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సలీం

భద్రాచలం నవంబరు 19 (జనంసాక్షి)

శ్రీ సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలను ఎలాంటి వివాదాలకు తావులేకుండా సజావుగా, పారదర్శకంగా నిర్వహించి నూతన కమిటీని ఏర్పాటు చేయాలని ఫుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సలీం కోరారు. ఎన్నికల ప్రక్రియ లో ఇరువర్గాలు పరస్పర పట్టుదలకు పోకుండా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం తొలుత అడహాక్ కమిటీని, అనంతరం అధికృత సలహా మండలిని ఏర్పాటు చేసినట్లు సలీం తెలిపారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగంగా సుమారు 1,100 దరఖాస్తులు అందగా, వాటిని పరిశీలించిన అనంతరం జనరల్ బాడీ ఆమోదించిందని పేర్కొన్నారు. సభ్యత్వానికి సంబంధించిన నగదు రవికుమార్ వద్ద భద్రంగా ఉందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత నూతన కమిటీకి అప్పగిస్తామని స్పష్టం చేశారు. జనరల్ బాడీ సమావేశంలో తాండ్ర వెంకట రమణారావును ఎన్నికల అధికారిగా ఎన్నుకున్నందున, ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా సహకరించాలని కోరారు. కోర్టు వివాదాల కారణంగా ఎన్నికలు మరింత ఆలస్యమైతే చివరకు నష్టపోయేది వ్యాపారులేనని అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత అభిప్రాయాలు, పట్టింపులను పక్కనపెట్టి వ్యాపారుల ప్రయోజనాలే లక్ష్యంగా ఇరువర్గాలు ముందుకు రావాలని, ఐక్యతను కాపాడుకుంటూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని షేక్ సలీం విజ్ఞప్తి చేశారు.



ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు

కల్లూరు నవంబర్ 19(జనంసాక్షి)

కల్లూరు మండలంచంద్రుపట్ల సెక్టార్ పరిధిలోని ఎర్రబోయినపల్లి అంగన్వాడి , కేంద్రంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బాలల హక్కుల వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని తెలిపారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాల వయసు వచ్చేవరకు పిల్లలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అన్నారు.అదేవిధంగా హై స్కూల్ విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి చట్టాల మీద అవగాహన కల్పించడం జరిగినది. బాలలే దేశానికి వెన్నుముఖ అని ప్రతి ఒక్కరూ చదువుకొని మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ అంగన్వాడి టీచర్స్ విజయ లక్ష్మీ, యశోద అది లక్ష్మీ, సుమలత తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా వనమా రాఘవేంద్ర జన్మదిన వేడుకలు

కొత్తగూడెం జనం సాక్షి నవంబర్ 19

ఈరోజు రామవరం వనమా సేన అభిమానుల సమక్షంలో ఖమ్మం రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్ర పుట్టినరోజు వేడుకలు రామవరం సెంటర్లో ఘనంగా నిర్వహించడం జరిగింది శ్రేణులు మాట్లాడుతూ వనమా రాఘవేంద్ర గారు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని ముమ్ముందు రాజకీయంగా అంచెలంచలు ఎదగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో గౌస్, కొయ్యడ శ్రీను, లచ్చిరాం, సురేందర్, రామకృష్ణారెడ్డి, తమ్మిశెట్టి అశోక్, ఆవునూరు చందర్, జి. రాజేందర్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు





ఎస్ఆర్ఎల్ఐపీ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

కల్లూరు నవంబర్ 19(జనం సాక్షి)

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు

భూసేకరణకు సంబంధించి సబ్ కలెక్టర్, అజయ్ యాదవ్,అధ్యక్షతన రెవిన్యూ ఇరిగేషన్ అధికారులతోసమీక్షా సమావేశం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారంనిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించడం తో పాటు, అవార్డు విచారణ , నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, భూసేకరణకు సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా భూసేకరణకు సంబంధించిన భూముల్లో ఉన్న చెట్లు, బావులు, ఇతర నిర్మాణాలు తదితర ఆస్తుల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, వాటి విలువను నిబంధనల ప్రకారం శాస్త్రీయంగా మదింపు చేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, చెట్లు ,నిర్మాణాలకు సంబంధించిన విలువ నిర్ధారణ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.



హుజూర్ నగర్ లో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

కాంగ్రెస్ పార్టీ నాయకులు : కస్తాల దిల్

హుజూర్‌నగర్ టౌన్, నవంబర్ 19(జనంసాక్షి):

భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 109 వ జయంతి వేడుకలు హుజూర్ నగర్ లో గురువారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కస్తాల దిల్ మాట్లాడుతూ... దేశ అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు మరువలేనివని, బ్యాంకుల జాతీయకరణ గరీబీ హటావో నినాదంతో పేదల సంక్షేమం కోసం ఆమె ఎన్నో పథకాలు తీసుకొచ్చారని ఆయన కొనియాడారు. పాకిస్తాన్ ని ఓడించి బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారణమైన ధైర్యశాలి ఇందిరాగాంధీ అని గుర్తు చేశారు. ఆమె ఆశయాలు కొనసాగించడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్ , మాజీ కౌన్సిలర్ రవి నాయక్ , సైదులు నాయక్, కౌన్సిలర్ చిన్న పంగు ప్రవీణ్, శివ, కస్తాల నరేందర్, గోపాల్ దాస్, కిరణ్, చిక్కుళ్ల శ్రీకాంత్, సాయి, అంజి, రఘు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

బానోత్ రాంబాబు మృతికి బీఆర్ఎస్ నాయకుల ఘన నివాళి

ఖమ్మం, (జనంసాక్షి) :



ఖమ్మం నగర కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్, గోపాలపురానికి చెందిన బానోత్ రాంబాబు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోపాలపురంలోని ఆయన నివాసానికి చేరుకుని, రాం బాబు పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాంబాబు ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ యువజన విభాగం అధ్యక్షుడు దేవభక్తిని కిషోర్, మాజీ ఎస్టీ సెల్ అధ్యక్షులు వాంకుడోత్ సురేష్, ఖమ్మం టౌన్ నాయకులు కందాల వీరేందర్ గౌడ్, 8వ డివిజన్ నాయకులు భానోత్ నరసింహ, భానోత్ శివశంకర్ సింగ్, భానోత్ వాగ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై లుగా పదోన్నతి పొందిన మహిళాఅధికారులను అభినందించిన సి పి



ఖమ్మం టౌన్ నవంబర్ (19). జనంసాక్షి.

ఎస్సైలుగా పదోన్నతి పొందిన మహిళా పోలీసు అధికారుల ను అభినందిన సి పి. వివిధ పోలీస్ స్టేషన్లలో ఎ ఎస్సై లుగా నిరంతరం సేవలందించిన. బట.నలీమ్ బేగం. టి.నాగరాజ.కుమారి.ఎస్సై.లుగా. పదోన్నతి లభించింది ఈ ఇద్దరు మహిళా పోలీసు అధికారుల ను అభినందించిన. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గురువారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నం అలంకరించి అభినందలు తెలిపారు.

అర్హులైన పెన్షన్ లబ్ధిదారులను గుర్తించాలి: కశ్రీ

ఎర్రుపాలెం,నవంబర్ 19 (జనంసాక్షి):

తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చేయూత నూతన పెన్షన్ల కొరకు గతంలో దరఖాస్తుకున్న లబ్ధిదారులకు మంజూరైన చేయూత నూతన పెన్షన్లు మంజూరు చేసే విషయంలో పలువురు అర్హులైన పెన్షన్దారులకు పెన్షన్లు రాలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పలువురు పెన్షన్ల లబ్ధిదారులు ఎంపీడీవో శారదాదేవి కి గురువారం మండల పరిషత్ కార్యాలయంలోవినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరు లిస్టులో వారి పేర్లు రాలేదు అన్నారు.అధికారులు ఎంక్వయిరీ చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి దరఖాస్తు చేసుకొని అర్హత కలిగిన వారికి మంజూరు చేయాలని వినతి పత్రంలో అధికారులను కోరారు.ఎంపీడీవో, ఎం.ఎస్.ఎస్, శారదా దేవి, మాట్లాడుతూ ఎంక్వయిరీ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించి అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు మంజూరు చేయించే విధంగా కృషి చేస్తా అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, శీలం.శ్రీనివాస్ రెడ్డి శీలం వెంకటరామిరెడ్డి, తలపురెడ్డి.నాగిరెడ్డి పలువురు నాయకులు లబ్ధిదారు పాల్గొన్నారు.



పిండిప్రోలుకు ప్రత్యేక సహకార సంఘం ఏర్పాటు

గ్రామస్తుల్లో హర్షాతిరేకం!

- దశాబ్దాల పోరాటానికి దక్కిన గుర్తింపు..
- ఆనాటి నాయకులు, సంఘ సభ్యుల కృషి ఫలించింది!
- లాభాల బాటలో పయనించిన పిండిప్రోలు సహకార సంఘానికి పూర్వవైభవం తీసుకురావాలి
- ప్రభుత్వం ధాన్యం కొనుగోలు బాధ్యతను సహకార సంఘాలకే అప్పగించాలి: మాజీ సీఈఓ ఏలూరు ఆనందరావు



తిరుమలాయపాలెం, నవంబర్ 19 (జనంసాక్షి) : పిండిప్రోలు గ్రామంలో నూతనంగా ప్రత్యేక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న తమ గ్రామ సహకార సంఘం ప్రత్యేక గుర్తింపు కోసం చేసిన పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది పిండిప్రోలు గ్రామ రైతుల ఐక్యతకు, ఆనాటి సహకార సంఘం నాయకులు, సభ్యుల పట్టుదలకు లభించిన విజయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా మాజీ సీఈఓ ఏలూరు ఆనందరావు మాట్లాడుతూ.. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకార సంఘాల విలీన ప్రక్రియ చేపట్టిన సమయంలో లాభాల బాటలో పయనిస్తున్న పిండిప్రోలు సహకార సంఘాన్ని తిరుమలాయపాలెం సహకార సంఘంలో విలీనం చేశారని తెలిపారు. దీనిపై అప్పటి సంఘ సభ్యులు, నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రత్యేక సంఘం కొనసాగింపు కోసం న్యాయపోరాటానికి దిగారని గుర్తు చేశారు.ఆనాటి సహకార సంఘం అధ్యక్షుడు కల్లూరు వాసయ్య ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, చివరి దశలో ప్రభుత్వం రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో పిండిప్రోలు సంఘానికి ప్రత్యేక గుర్తింపు లభించలేదన్నారు. పిండిప్రోలు స్థానంలో బీరోలు సహకార సంఘం ఏర్పాటు కావడం కూడా అప్పట్లో గ్రామస్తుల్లో అసంతృప్తికి కారణమైందని వివరించారు.

ఒకప్పుడు లాభాల బాటలో పయనించిన సంఘం

పిండిప్రోలు సహకార సంఘం గతంలో రైతులకు ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచుతూ వ్యవసాయ అభివృద్ధికి విశేష సేవలందించిందని ఆనందరావు తెలిపారు. క్రిమికో యూరియా కంపెనీతో పాటు ఇతర సంస్థల్లో వ్యాపార లావాదేవీలు, డిపాజిట్లు కలిగి ఉండటంతో ఆర్థికంగా బలమైన సహకార సంఘంగా గుర్తింపు పొందిందన్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ సమయంలో కూడా అత్యధికంగా బకాయిలు వసూలు చేసిన సంఘాల్లో పిండిప్రోలు సహకార సంఘం ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.అప్పట్లో ప్రభుత్వం సహకార సంఘాల విలీనానికి ఆరు అంశాలను ప్రాతిపదికగా తీసుకోగా, ఐదు అంశాల్లో పిండిప్రోలు సంఘం అర్హత సాధించిందని, ఒక్క అంశంలో మాత్రమే 50 శాతం అర్హత రావడంతో విలీన ప్రక్రియలో భాగంగా తిరుమలాయపాలెం సంఘంలో కలిపారని వివరించారు.

ధాన్యం కొనుగోళ్ల బాధ్యత సహకార సంఘాలకే అప్పగించాలి

గతంలో సహకార సంఘాలు ధాన్యం కొనుగోళ్లలో చురుకుగా పాల్గొనేవని, వడ్ల కొనుగోళ్ల ద్వారా తిరుమలాయపాలెం సహకార సంఘానికి సుమారు రూ.15 లక్షల లాభం వచ్చిందని ఆనందరావు గుర్తు చేశారు. అప్పట్లో వచ్చిన లాభాల్లో ఉద్యోగులకు 30 శాతం వరకు బోనస్ ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు.
అయితే కాలక్రమేణా అధికారుల నిర్లక్ష్యం, సరైన ప్రోత్సాహం లేకపోవడంతో సహకార సంఘాలు ధాన్యం కొనుగోళ్లలో పాల్గొనడం తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల సంఘాల ఆర్థిక పరిస్థితి, సభ్యుల భాగస్వామ్యం కూడా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా ప్రతి సహకార సంఘానికి ధాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగించి, రైతులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనివల్ల రైతులకు మేలు జరగడంతో పాటు సహకార సంఘాలు కూడా ఆర్థికంగా బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు.

ప్రత్యేక గుర్తింపుతో గ్రామానికి కొత్త ఆశలు

పిండిప్రోలు సహకార సంఘానికి ప్రత్యేక గుర్తింపు కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి, ఇందుకు సహకరించిన అధికారులకు, సహకార శాఖ ప్రతినిధులకు ఏలూరు ఆనందరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆనాటి నాయకులు, సహకార సంఘ సభ్యులు చేసిన కృషి, న్యాయపోరాటం నేటి విజయానికి పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు.చరిత్ర కలిగిన పిండిప్రోలు గ్రామానికి ప్రత్యేక సహకార సంఘం ఏర్పాటు కావడం ఎంతో గర్వకారణమని, ఇకపై రైతుల అవసరాలకు అనుగుణంగా సంఘాన్ని అభివృద్ధి చేసి, గత వైభవాన్ని తిరిగి తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. ఈ నిర్ణయం పిండిప్రోలు రైతుల అభ్యున్నతికి కొత్త బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు పిండిప్రోలు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలియజేశారు



తాళ్లపెంటలో రీసర్వే పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

పెనుబల్లి, నవంబర్ 19(జనంసాక్షి)

పెనుబల్లి మండలంలోని తాళ్లపెంట గ్రామంలో చేపట్టిన భూ రీసర్వే పనులను గురువారం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులతో, సర్వే బృందాలతో ఆయన మాట్లాడి రీసర్వే పనుల పురోగతిని సమీక్షించారు.తాళ్లపెంట గ్రామానికి సంబంధించి మొత్తం 8,462.02 ఎకరాల భూవిస్తీర్ణం ఉండగా, అందులో 4,465 ఎకరాలు అటవీ భూమిగా ఉన్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటివరకు 517 ఎకరాల 17 కుంటల భూమికి సంబంధించి ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మూడు ప్రత్యేక సర్వే బృందాల ద్వారా సర్వే పనులు కొనసాగుతున్నాయని సర్వేయర్లు వివరించారు.
ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రైతులతో మాట్లాడి రీసర్వే ప్రాముఖ్యతను వివరించారు. భూముల వాస్తవ విస్తీర్ణం, సరిహద్దులు, హక్కులు అనుభవదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా చేయవచ్చని తెలిపారు. రైతులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని, తమ భూముల వివరాలు సరిహద్దులను సర్వే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు.
అలాగే, సర్వే పనులను పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని సర్వేయర్లకు సూచించారు. రీసర్వే ప్రక్రియలో రైతుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి రైతుకు తన భూమికి సంబంధించిన ఖచ్చితమైన వివరాలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

ఎర్రుపాలెం,నవంబర్ 19 (జనంసాక్షి) :

ఇందిరా గాంధీ జయంతి వేడుకలు గురువారం ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయము నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు కాంగ్రెస్ నాయకులు మండల అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మాట్లాడుతూ మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నంద్రు.అశ్విని, మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్ రెడ్డి,తల్లపు రెడ్డి నాగిరెడ్డి లక్ష్మీపురం సర్పంచ్. గారు క్లస్టర్ ఇన్చార్జిలు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాసరావు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు

వైరా, నవంబర్ 19 (జనంసాక్షి):



బాల్య వివాహ రహిత భారత్ అభియాన్‌లో భాగంగా ఖమ్మం జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహాల నిషేధ చట్టం?2006, బాలికల విద్య, బాలల హక్కులు, మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాచారం తెలిస్తే 1098 బాలల సహాయవాణికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ సమ్రీన్, జెండర్ స్పెషలిస్ట్ ప్రమీల, వాసంతి, ఏపీఎం రాంబాబు, ఎంఎస్ అధ్యక్షురాలు, కళాశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

చింతనిపు సత్యనారాయణకు మాజీ ఎంపీ నామ ఘన నివాళి

అంత్యక్రియల్లో పాడె మోస్తూ కన్నీటి వీడ్కోలు

పెనుబల్లి, నవంబర్ 19(జనంసాక్షి)

పెనుబల్లి మండలం కారాయిగూడెం సొసైటీ చైర్మన్ చింతనిపు సత్యనారాయణగురువారం గుండె పోటుతో మృతిచెందారు, ఆయన అకాల మరణ వార్త తెలిసిన వెంటనే ఖమ్మం మాజీ ఎంపీ, బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు తన కార్యక్రమాలను రద్దు చేసుకుని హుటాహుటిన కారాయిగూడెం చేరుకున్నారు. సత్యనారాయణ పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోస్తూ కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సత్యనారాయణతో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని నామ గుర్తు చేసుకున్నారు. సర్పంచ్‌గా, శ్రీ నీలాద్రీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా, సహకార సంఘం చైర్మన్‌గా ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. సత్యనారాయణ మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కనగాల వెంకటరావు, లగడపాటి. శ్రీనివాసరావు, చెక్కిలాల మోహన్ రావు, చెక్కిలాల లక్ష్మణరావు, నరుకుళ్ళ.సత్యనారాయణ, పసుమర్తి



వెంకటేశ్వరరావు చీకటి మోహన్ రావు, మోరంపూడి ప్రసాద్ రావు, మందడపు అశోక్ కుమార్, చింతనిప్పు శ్రీనివాసరావు, గోదా చెన్నారావు, గువ్వల వెంకట రెడ్డి, దొడ్డపనేని రవి, బెల్లంకొండ చలపతిరావు, రేగుముడి అప్పయ్య, కోమటి ప్రసాద్, మోరంపూడి బాబురావు, వాకదాని కోటేశ్వరరావు, చింతనిప్పు కృష్ణ చైతన్య, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని సత్యనారాయణకు ఘన నివాళులర్పించారు.

డిపెండెంట్ లకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ఏఐటీయూసీ

కొత్తగూడెం నవంబర్ 19 జనంసాక్షి

సింగరేణి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర నాయకులు వంగ వెంకట్ మాట్లాడుతూ మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు జీతభత్యాలు చెల్లించకుండా ఖాళీగా ఉంచడం అన్యాయమని అన్నారు. మెడికల్ ఫిట్ అయిన రోజు నుంచే జీతభత్యాలు చెల్లించాలని, లేదంటే తక్షణమే ఉద్యోగ నియామక పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఇన్వాలిడేషన్ అయిన వెంటనే టెర్మినల్ బెనిఫిట్స్ అందక, వారి వారసులకు ఉద్యోగాలు రాక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. సుమారు 200 మంది డిపెండెంట్లు మెడికల్ ఫిట్ అయినప్పటికీ ఉద్యోగ నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మెడికల్ బోర్డుల పేరుతో కాలయాపన చేయకుండా గతంలో మాదిరిగా 100 శాతం ఇన్వాలిడేషన్ విధానాన్ని అమలు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. అదేవిధంగా టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పాల్వంచలో టిప్పర్ బీభత్సం

○ విద్యార్థినికి తీవ్ర గాయాలు
○స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టి కాలుపై నుంచి వెళ్లిన లారీ టైరు

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 19 (జనంసాక్షి): పాల్వంచ పట్టణంలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన టిప్పర్ లారీ స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇంటర్మీడియట్ విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న ఆమె సోదరుడు కూడా గాయపడ్డాడు.స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన జాటోత్ మానాక్షి (16) దమ్మపేట సెంటర్‌లోని కృష్ణవేణి కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం ఉదయం సుమారు 7.15 గంటలకు తన అన్నయ్య జాటోత్ దుర్గాప్రసాద్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయలుదేరింది. ఉదయం 7.30 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ ప్రవేశ ద్వారం సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగానే, భద్రాచలం వైపు నుంచి కొత్తగూడెం వెళ్తున్న టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి వారి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. లారీ ముందు చక్రం మానాక్షి ఎడమ కాలు మీదుగా వెళ్లడంతో తీవ్ర రక్తగాయమైంది. దుర్గాప్రసాద్‌కు ఎడమ వైపు పక్కటెముకల వద్ద గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మానాక్షి సోదరుడు జాటోత్ ప్రేమ్ కుమార్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో క్షతగాత్రులను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మానాక్షిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని శ్రీచక్ర సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీ డ్రైవర్‌ను మెరంపల్లి బంజారాకు చెందిన ధార రామ్మూర్తి (55)గా గుర్తించారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రేమ్ కుమార్ పాల్వంచ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూర్జహాన్ పేట్ లో పోలీసుల మెరుపు దాడి

2 లీటర్ల నాటు సారాయి స్వాధీనం, ఒకరి అరెస్ట్

పెన్‌పహాడ్, నవంబర్ 19 (జనంసాక్షి) :

నాటు సారాయి విక్రయాలపై పెన్‌పహాడ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. నమ్మదగిన సమాచారం అందడంతో ఎస్ఐ బాలు నాయక్ తన సిబ్బంది ప్రవీణ్, రవి కుమార్ తో కలిసి నూర్జహాన్ పేట్ లోని గూగులోత్ బాలి ఇంటిపై మెరుపు దాడి చేశారు.ఈ దాడిలో బాలి తన ఇంట్లో అమ్మకానికి సిద్ధంగా దాచి ఉంచిన, తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన సుమారు 2 లీటర్ల నాటు సారాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిషేధిత నాటు సారాయి విక్రయిస్తున్నందుకు గూగులోత్ బాలి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలు నాయక్ తెలిపారు. మండలంలో ఎక్కడ నాటు సారాయి అమ్మినా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన నలుగురిపై పోలీసుల చర్యలు

భద్రాచలం నవంబరు 19 (జనంసాక్షి)

పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించేలా వాహనాలు నడుపుతున్న వారిపై భద్రాచలం టౌన్ పోలీసులు చర్యలు చేపట్టారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించారు.ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద నిర్లక్ష్యంగా ఆటో నడిపిన కుర్రి కల్యాణ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద బ్లూకోల్ట్స్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు పి. బ్రహ్మయ్య, పి. ప్రవీణ్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలు నడిపిన సీసం చంటి, మడకం దుర్గారావుతో పాటు, అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకొని ఆటో నడుపుతున్న బోడ మహేష్‌ను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని పోలీసులు సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా నిబంధనల ఉల్లంఘనపై తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

తెల్లం శరత్‌కు న్యాయం జరిగే వరకు ఐక్య పోరాటం ఆగదు

ఆదివాసీ, దళిత, బహుజన సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలి.. మానే రామకృష్ణ

భద్రాచలం నవంబరు 19 (జనంసాక్షి) : ఆదివాసీ యువకుడు తెల్లం శరత్ హత్య ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆదివాసీ, దళిత, బహుజన సంఘాల ఐక్య పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ పార్టీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానే రామకృష్ణ స్పష్టం చేశారు. శరత్ హత్యను ఖండిస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాచలంలో వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా మానే రామకృష్ణ మాట్లాడుతూ తెల్లం శరత్ హత్య ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసిందని అన్నారు. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్యాయానికి వ్యతిరేకంగా గొంతెత్తే ప్రతి ఒక్కరూ బాధిత కుటుంబానికి అండగా నిలవాలని, న్యాయం సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. శరత్



కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు గుండు శరత్, కుంజా ధర్మారావు, కుంజా సంతోష్, ముర్ల రమేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, బీజేపీ నాయకులు ఆవుల సుబ్బారావు, ములిశెట్టి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపద్బాంధవులు..

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలిచిన రామన్నపేట యువత!



ఖమ్మం (జనంసాక్షి):

"రక్తదానం చేయండి.. మరొకరికి ప్రాణం పోయండి" అనే నినాదాన్ని అక్షరాలా నిజం చేస్తూ ఖమ్మం జిల్లా రామన్నపేట గ్రామానికి చెందిన యువత తమ గొప్ప మనసును చాటుకున్నారు. వెంకటాపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని, ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. ఈ మహత్కార్యంలో రామన్నపేట యువకులు కొలికపొంగు వెంకీ, ఆరంపల నరేష్, దోసపాటి సాయి, సోమవరపు మరియదాసు, మహేందర్, బంక మహేష్ ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన ఈ యువకులను అక్కడి డాక్టర్లు, ఆశా వర్కర్లు ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను (సర్టిఫికెట్లను) అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. "యువత ఇలాగే స్పందిస్తే రక్తం అందక ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండదు. వీరి సేవాభావం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు.

బీటీపీఎస్ కార్మికుల సీనియారిటీ జాబితా వెంటనే ప్రకటించాలి

○వచ్చే నెలాఖరులోగా విడుదల చేస్తామని సీఈ హామీ
○చీఫ్ ఇంజినీర్ బి. బిచ్చన్నకు వినతిపత్రం అందజేసిన విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు



కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 19 (జనంసాక్షి)

భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్)లో పనిచేస్తున్న కార్మికుల సీనియారిటీ జాబితాను వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌పీఈయూ?1535) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మణుగూరులోని బీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ బి. బిచ్చన్నను సంఘం ప్రాంతీయ నాయకులు కలిసి కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సంఘం ప్రాంతీయ అధ్యక్షుడు వి. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్. రామచందర్, జెన్‌కో సంయుక్త కార్యదర్శి సిద్ధులు హుస్సేన్ మాట్లాడుతూ.. బీటీపీఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను చీఫ్ ఇంజినీర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సీనియారిటీ జాబితాను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న బొగ్గు, ధూళి భత్యాలను మంజూరు చేయాలని కోరారు. భూనిర్వాసితుల కోటాలో నియమితులై ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కార్యాలయ సహాయకులు, గృహ నిర్వహణ సిబ్బందిని జూనియర్ ప్లాంట్ అటెండెంట్లుగా పదోన్నతి కల్పించేందుకు శాఖా పరమైన పదోన్నతుల కమిటీని నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభమై ఆరేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు డ్రైవర్ పోస్టులు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. ప్లాంట్ అవసరాల దృష్ట్యా డ్రైవర్లు, డోజర్ యంత్రాల నిర్వాహకులు, క్రేన్ నిర్వాహకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. బీటీపీఎస్ టౌన్‌షిప్‌లో నిర్మిస్తున్న ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులో ఉంచాలని సూచించారు. సానుకూలంగా స్పందించిన సీఈ యూనియన్ నాయకులు ప్రస్తావించిన సమస్యలపై చీఫ్ ఇంజినీర్ బి. బిచ్చన్న సానుకూలంగా స్పందించారు. విద్యుత్ సౌధలోని ఉన్నతాధికారులు డైరెక్టర్ (మానవ వనరులు) కుమార్ రాజు, ముఖ్య జనరల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, ఆర్థిక సలహాదారు సత్యరాజులతో చర్చించిన అనంతరం పలు హామీలు ఇచ్చారు. వచ్చే నెలాఖరులోగా కార్మికుల సీనియారిటీ జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. కార్యాలయ సహాయకులు, గృహ నిర్వహణ సిబ్బందికి త్వరలోనే శాఖాపరమైన పదోన్నతుల కమిటీ నిర్వహించి జూనియర్ ప్లాంట్ అటెండెంట్లుగా మార్పు ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ (పరిపాలన) వి. మురళీకృష్ణతోపాటు కార్మిక సంఘ నాయకులు కే. వీరబాబు, బి. నరసింహారావు, సీహెచ్. వెంకటరమణ, జి. రవికుమార్, ఎస్.కే. సలీం పాషా, తిరుపాల్ రెడ్డి, కళ్యాణి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతనిప్పుసత్యనారాయణ మృతి తీరని లోటు

సంతాపం తెలిపిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

పెనుబల్లి,నవంబర్19 (జనంసాక్షి):

మండల సీనియర్ నాయకులు ,నీలాద్రి దేవస్థానము మాజీ చైర్మన్ ,పాత కారాయి గూడెం సొసైటీ చైర్మన్ చింతనిప్పు సత్యనారాయణ గుండెపోటుతో మృతి చెందటం బాధాకరం అని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.



మరణంలోనూ వీడని దాంపత్య బంధం..!

○ఒక్కరోజు వ్యవధిలోనే భార్యాభర్తల కన్నుమూత..
○గ్రామాన్ని కన్నీటి సంద్రంలో ముంచిన విషాదం..

ఖమ్మం రూరల్, నవంబర్ 19(జనంసాక్షి):
కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలుస్తూ.. జీవిత ప్రయాణంలో అడుగడుగునా అనుబంధాన్ని పంచుకున్న ఆభార్యాభర్తలను విధి సైతం విడదీయలేకపోయిందేమో..! జీవితాంతం కలిసిమెలిసి సాగిన వారి ప్రయాణం మరణం లోనూ ఒకరోజు వ్యవధిలోనే ముగిసింది. భార్య మరణించిన మరుసటి రోజే భర్త సైతం తుదిశ్వాస విడవడంతో కొండాపురం గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.పూర్తి వివరాలలోకి వెళ్తే..ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగండ్ల శ్రీనివాసరావు, ఆయన భార్య రమాదేవి వరుసగా మృతి చెందడం స్థానికులను కలచివేసింది. కొంతకాలంగా అ నారోగ్యంతో బాధపడుతున్న రమాదేవి బుధవారం కన్నుమూశారు. జీవిత భాగస్వామిని కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబ సభ్యులు ఆ విషాదం నుంచి తేరుకోకముందే గురువారం తెల్లవారు జామున శ్రీనివాసరావు కూడా తుదిశ్వాస విడిచారు. దశాబ్దాల దాంపత్య జీవితంలో ఒకరికొకరు తోడుగా నిలిచిన ఆ జంట ఇలా ఒక్కరోజు వ్యవధిలోనే లోకాన్ని విడిచిపెట్టడం కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను శోకసంద్రంలో ముంచింది. గ్రామంలోనూ ఈ విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ తీవ్రగ్రాంతికి గురయ్యారు. ప్రజాజీవితంలో సర్పంచ్గా, కాంగ్రెస్ నాయకుడిగా గుర్తింపు పొందిన శ్రీనివాసరావు మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.మనిషి జీవితం ముగిసినా.. పంచుకున్న ప్రేమ, అనుబంధం మాత్రం మిగిలిపోతాయనే భావనను గుర్తుచేస్తూ.. మరణంలోనూ విడదీయలేని ఆ దంపతుల బంధం గ్రామస్థుల హృదయాలను కలచివేసింది.

సంతాపం వ్యక్తం చేసిన మంత్రి పొంగులేటి

శ్రీనివాసరెడ్డి
మాజీ సర్పంచ్ నాగండ్ల శ్రీనివాసరావు మృతి పట్ల పొంగులేటి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు. ఒక్క రోజు వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి చెందడంలోనే చాలా బాధాకరమని అన్నారు.



ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

చంద్రుగొండ, నవంబర్ 19 (జనంసాక్షి):
చంద్రుగొండ మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి నివాళులర్పిస్తూ, దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలను కాంగ్రెస్ నాయకులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్, తుమ్మలపల్లి సురేష్, సారేపల్లి శేఖర్, ఇమ్రాన్, గుగులోతు బాబు, ఇస్లావత్ రుక్మిణి, మహేష్, రసూల్, కృష్ణవేణి, చాపలమడుగు లక్ష్మణ్, చాపలమడుగు ప్రసాద్, మనోహర్, నిమ్మగడ్డ శ్రీను, అన్వర్ పాషా, రాంబాబు, కడియాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధనుశ్రీకి శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ వారిచే 15 వేల చెక్కు అందజేత



చంద్రుగొండ, నవంబర్ 19(జనంసాక్షి):
చంద్రుగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంస్థలో పదవ తరగతిలో మండల స్థాయిలో ప్రథమరాలుగా నిలిచిన ధను శ్రీ కి రామ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో రూ 15 వేల రూపాయలను ఐటిడిఏ పిఓ రాహుల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీ రామా లైఫ్ ఇన్సూరెన్స్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందించటానికి ఆయన అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నదని దానిని విద్యార్థులు ఉపయోగించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పేర్కొన్నారు.

ఎర్రుపాలెం తాసిల్దారుగా ఉషా శారద

ఎర్రుపాలెం,నవంబర్ 19 (జనంసాక్షి):
ఎర్రుపాలెం తాసిల్దారుగా ఎం ఉషా శారద, గురువారం ఎర్రుపాలెం తాసిల్దార్ కార్యాలయంలోబాధ్యతలు స్వీకరించారు. తాసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ఎం.ఉషా శారద గతంలో ఖమ్మం ఆర్డీవో కార్యాలయంలో తాసిల్దారుగా విధులునిర్వహించారు. బదిలీపై ఎర్రుపాలెం తహసిల్దార్గా పూర్తి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఇక్కడ గతంలో పనిచేసిన తాసిల్దార్ సునీత ఎలిజిబెత్ వేమ్సూరుకు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎర్రుపాలెం తాసిల్దార్ ఎం.ఉషా శారద మాట్లాడుతూ ఇక్కడ గతంలో పనిచేసిన అనుభవం ఉన్నందున మండలంలో రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ, రవికుమార్, శిరీష, జి.పి.ఓ.లు, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.



బూత్ స్థాయి నుంచి పార్టీని అజేయ శక్తిగా తీర్చిదిద్దాలి

○ కేంద్ర పథకాలతో ప్రజల్లోకి.. ఎస్ఐఆర్పై కార్యకర్తలకు దిశానిర్దేశం
○ తెలంగాణ రాష్ట్ర సహ సంఘటనా మంత్రి, రాష్ట్ర సహ సంస్థాగత ప్రధాన కార్యదర్శి దశరథ్

ఖమ్మం, నవంబర్ 19, (జనంసాక్షి) :
క్షేత్రస్థాయిలో పార్టీ పునాదులను మరింత బలోపేతం చేస్తూ, ప్రతి పోలింగ్ బూత్ను పార్టీకి బలమైన కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సంస్థాగత నిర్మాణం, బూత్ కమిటీల పటిష్ఠత, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రజలకు చేరువ కావాలని నాయకత్వం దిశానిర్దేశం చేసింది.గురువారం ఖమ్మంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సహ సంఘటనా మంత్రి, రాష్ట్ర సహ సంస్థాగత ప్రధాన కార్యదర్శి దశరథ్ జీ, రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ ప్రస్తుత సంస్థాగత పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు.

బూతే పార్టీకి బలం.. సంస్థాగత నిర్మాణమే లక్ష్యం
పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నిర్మాణం అత్యంత కీలకమని సమావేశంలో ప్రాధాన్యత నిచ్చారు. ప్రతి బూత్కు సమర్థవంతమైన కమిటీని ఏర్పాటు చేయడం, ఇప్పటికే ఉన్న కమిటీలను క్రియాశీలకం చేయడం, శక్తి కేంద్రాలు, మండల కమిటీల మధ్య సమన్వయం పెంచడం వంటి అంశాలపై దృష్టి సారించారు. ఓటరు జాబితాలోని ప్రతి ప్రాంతానికి బాధ్యత వహించేలా కార్యకర్తలకు విధులు కేటాయిస్తూ, పన్నా ప్రముఖ్ వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాల్సిన



అవసరాన్ని వివరించారు. పార్టీ కార్యక్రమాలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి కుటుంబానికి చేరాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పార్టీకి ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని పెంపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

కేంద్ర పథకాలపై ఇంటింటా అవగాహన
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జన్ధన్ యోజన తదితర పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలకు వాటి వివరాలను తెలియజేయడంతోపాటు, అర్హులైన వారికి పథకాల ప్రయోజనాలు అందేలా కార్యకర్తలు చొరవ తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని చర్చించారు.

ఎస్ఐఆర్పై అప్రమత్తంగా ఉండాలి
ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కూడా సమావేశంలో కీలక చర్చనీయాంశంగా నిలిచింది. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, ఓటరు వివరాల్లో తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యతపై చర్చించారు. మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లకు సంబంధించిన వివరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించాలని, అర్హులైన ఓటర్ల పేర్లు అన్యాయంగా తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాల నమోదు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఎన్నికల సంఘం తాజా షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో అభ్యంతరాలు, క్లెయిమ్ల పరిష్కారానికి డిసెంబర్ 15 వరకు గడువు ఉండగా, తుది ఓటరు జాబితా డిసెంబర్ 22న ప్రచురించనున్నారు.
సంస్థాగత క్రమశిక్షణ, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం అనే నాలుగు అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఖమ్మం జిల్లాలో పార్టీని మరింత విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించడంపై సమావేశం దృష్టి సారించింది. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టి బాధ్యతతో పనిచేస్తేనే పార్టీ లక్ష్యాలను సాధించగలమనే దిశగా నాయకులు చర్చించారు.ఈ సమావేశంలో జిల్లా ప్రబారీలు కొండపల్లి శ్రీధర్ రెడ్డి సన్య ఉదయ ప్రతాప్, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వర రావు మాజీ జిల్లా అధ్యక్షులు జిల్లా కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ గోంగూర వెంకటేశ్వరరావు , రుద్ర ప్రదీప్ నున్న రవి మందారపు సుబ్బారావు భూక్య శ్యామ్సుందర్ నాయక్ చిలుకూరు రమేష్ అనిత జిల్లా పదాధికారులు మండల అధ్యక్షులు , నాయకులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు..

అశ్వాపురంలో ఘనంగా ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలు

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రచార కరపత్రాల పంపిణీ

అశ్వాపురం, నవంబర్ 19 (జనంసాక్షి):
మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిస్తూ పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు అన్నారు. ఇందిరాగాంధీ 109వ జయంతి సందర్భంగా అశ్వాపురంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (ఓరుగంటి వీరయ్య భవన్)లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. 'గరీబీ హటావో' నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేసిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని, దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం తీసుకొస్తోందని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార కరపత్రాలను గ్రామపంచాయతీల వారీగా సర్పంచులు, కాంగ్రెస్ నాయకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గడపకు కరపత్రాలు చేర్చి, పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. నే?టి? నుంచి ఆరు గ్రామపంచాయతీల్లో నమోదు: నవంబర్ 20 నుంచి అశ్వాపురం, గొందిగూడెం కొత్తూరు, ఎలుకలగూడెం, సంద్రలబోడ్, చింత్రియాల, సీతారాంపురం గ్రామపంచాయతీల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమం ప్రారంభం కానుంది. ఆయా గ్రామాల్లో ప్రతి కుటుంబం నమోదు చేసుకునేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని మండల అధ్యక్షుడు కోరారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ మచ్చా నరసింహారావు, ఏఎంసీ డైరెక్టర్లు తెల్లం వీరభద్రం, సోడే వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఓరుగంటి బిక్షమ్మయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, కందాల వెంకటరెడ్డి, వేములపల్లి రమేష్, కొండాబత్తుల ఉపేందర్, తూము వీరరాఘవులు, ఆవుల రవి, సామకూరి వెంకన్న, లంకమల్ల కొండలరావు, బచ్చు వెంకటరమణ, జిన్నక నాగయ్య, సురకంటి గంగారెడ్డి, మానాది వెంకన్న, తెల్లం నాగరాజు, తెల్లం వెంకటేశ్వర్లు, భూతం వెంకన్న, గొల్లపల్లి నరేష్, వేముల విజయ్, కోలా శశికాంత్, కంటెం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మందరికలపాడులో ఎంపీడీఓ, ఎంపీఓ పర్యటన

ఇంకుడు గుంతల పనుల ప్రారంభం

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 19, (జనం సాక్షి);
పాల్వంచ మండలంలోని మందరికలపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఎంపీడీఓ పి. రాజారావు మరియు మండల పంచాయతీ అధికారి షేక్ షబ్నా గురువారం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా అధికారులు ముందుగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి నిర్వహణ తీరును, చిన్నపిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం మరియు సేవలను నిశితంగా పరిశీలించారు. అనంతరం మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను సందర్శించి, గ్రామానికి జరుగుతున్న తాగునీటి సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

భూగర్భ జలాల పెంపొందించడమే లక్ష్యం:
గ్రామంలో భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో 26 ఇంకుడు గుంతల నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించవచ్చని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై

సమీక్ష:
అనంతరం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా మొదటి విడత (ఖ్వజీబవ-ఎ)కి ఎంపికైన గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులతో అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకం క్షేత్రస్థాయి అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లబ్ధిదారుల వివరాల నమోదు వేగవంతం చేయడం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు తగిన మార్గదర్శకాలు మరియు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మందరికలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి భానులక్ష్మి, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



దళారులను నమ్మి మోసపోకండి

పారదర్శకంగా వైద్య సిబ్బంది నియామక ప్రక్రియ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 19 (జనంసాక్షి)
ఖమ్మం జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీలకు చెందిన 99 వైద్య సిబ్బంది పోస్టులను (గైనకాలజిస్ట్, అనస్థీషియా, యూరాలజిస్ట్, పాథాలజిస్ట్, పీడియాట్రీషియన్, జనరల్ ఫిజీషియన్, జీడీఎంవో, ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో/ఎంవో, టీబీ-హెచ్ఐవీ సూపర్‌వైజర్, నర్సింగ్ ఆఫీసర్లు, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, సైకాలజిస్ట్) కాంట్రాక్ట్ మరియు పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించడం జరిగింది. అయితే, ఈ పోస్టుల ఎంపిక మరియు నియామకాలకు సంబంధించి కొందరు దళారులు (మధ్యవర్తులు) అభ్యర్థుల వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న సందర్భంగా అభ్యర్థులకు మరియు ప్రజలకు తెలియజేయునది ఏమనగా: ఈ నియామక ప్రక్రియ అంతా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గల జిల్లా ఎంపిక కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు కేవలం మెరిట్ (ప్రతిభ) ఆధారంగా మాత్రమే నిర్వహించబడుతుంది. ఇందులో ఎవరి ప్రమేయానికి గానీ, పైరవీలకు గానీ ఎటువంటి అవకాశం లేదు. కావున అభ్యర్థులు ఎవరూ దళారుల మాయమాటలను, తప్పుదు ప్రచారాలను నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని విజ్ఞప్తి చేస్తున్నామని, ఎవరైనా ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసినా, వసూలు చేస్తున్నట్లు తెలిసినా వెంటనే జిల్లా కలెక్టర్ గారి కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయగలరు. అటువంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు ప్రకటించారు.

కుటుంబాల భద్రతే.. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

చంద్రుగొండ, నవంబర్ 19 (జనంసాక్షి):
కుటుంబాల భద్రతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు కాంగ్రెస్ నాయకులు కృషి చేస్తున్నారు. మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో, పథకం అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలకు నాయకులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గురువారం చంద్రుగొండ మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రచార పాంప్లెట్లను విడుదల చేశారు. ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రావడం ద్వారా ప్రతి కుటుంబానికి భరోసా కలుగుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ తెలిపారు. పథకంలో వయసు ధ్రువీకరణకు ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారని, 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సభ్యుల్లో కుటుంబ పెద్దను పథకానికి ప్రతిపాదిస్తారని వివరించారు. దేశంలోనే తొలిసారిగా అమలు చేస్తున్న కుటుంబ జీవిత బీమా పథకంగా దీనిని పేర్కొంటూ, పథకం అమలుకు సంబంధించి ప్రజల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదని, మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్, తుమ్మలపల్లి సురేష్, సారేపల్లి శేఖర్, ఇమ్రాన్, గుగులోతు బాబు, ఇస్లావత్ రుక్మిణి, మహేష్, రసూల్, కృష్ణవేణి, చాపలమడుగు లక్ష్మణ్, చాపలమడుగు ప్రసాద్, మనోహర్, నిమ్మగడ్డ శ్రీను, అన్వర్ పాషా, రాంబాబు, కడియాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





వినియోగదారుల మన్ననలు పొందాలి

సూర్యాపేట(జనంసాక్షి):
వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించి వారి మన్ననలను పొందాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన హామ్ ది కేఫ్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని అన్నారు.నాణ్యమైన,నమ్మకమైన సేవలను అందిస్తూ వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం కేఫ్ నిర్వాహకులు అబ్బోజు శ్రావణి, అబ్బోజు అభిజ్ఞ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన హామ్ ది కేఫ్ ను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గురగంటి హేమసతీష్, అబ్బోజు విద్యులత, శరత్ కుమార్, నిధిశ్రీ, రాఘవరావు, సరోజ,మాధవిలత, ఉషశ్రీ, ఉదయశ్రీ, కీర్తన్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున పాఠశాలలో ఆత్మీయతతో పురుషుల దినోత్సవ వేడుకలు



రామన్నపేట, నవంబర్ 19 (జనంసాక్షి):
రామన్నపేట పట్టణ కేంద్రంలోని నాగార్జున పాఠశాలలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను ఎంతో ఆనందోత్సాహాలతో, ఆత్మీయ వాతావరణం లో నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న పురుష ఉపాధ్యాయులు, సిబ్బంది సేవలను గుర్తిస్తూ మహిళా ఉపాధ్యాయినులు ప్రత్యేకంగా బహుమతులు అందజేసి,సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ డాక్టర్ నకిరేకంటి నాగరాజు మాట్లాడుతూ..ఒక విద్యాసంస్థ అభివృద్ధిలో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి కృషి ఎంతో విలువైందన్నారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ మిర్జా అక్రమ్ బేగ్,ఇంగ్లీష్ ఉపాధ్యాయులు లిబుమోన్ పాల్గొని వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకువచ్చారు. మహిళా ఉపాధ్యాయినులు అందించిన బహుమతులు కేవలం కానుకలు మాత్రమే కాదు తమ సహచరుల పట్ల ఉన్న గౌరవం, అభిమానం, ఆత్మీయత కు ప్రతీకలు. ఇలాంటి చిన్న చిన్న వేడుకలు ఉపాధ్యాయుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడమే కాకుండా, పాఠశాలలో కుటుంబసభ్యుల వంటి అనుబంధాన్ని మరింత బలపరుస్తాయి అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

దాతల సహకారం అభినందనీయం

పెన్‌పహాడ్, నవంబర్ 19 (జనం సాక్షి) :
ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యడవెల్లి సురేందర్ రెడ్డి, వీరబోయిన నాగయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల భక్తళాపురం, ఎల్లప్పకుంట తండా ఎంపీపీ ఎస్ పాఠశాలలో చదివే విద్యార్థులకు దాతలు కరణం నాగేష్ వర్మ రామన్నమ్మ కుటుంబ సభ్యులు తమతల్లి కరణం నర్సమ్మ జ్ఞాపకార్థం (కరణం నర్సమ్మ మెమోరియల్ పేరుతో) 100 మంది విద్యార్థులకు సుమారు 40 వేల వ్యయం తో విద్యార్థులకు క్రీడా దుస్తువులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సమన్వయకర్త నెమ్మని వెంకటేశ్వర్లు,ప్రధానోపాయులు వినోద్, ఏఎంసీ చైర్మన్ మచ్చ లక్ష్మి, ఉపాధ్యాయులు వడ్డె మాధవ రెడ్డి, షేక్ వహీద్, చల్లా సంధ్య, కైగూరి నాగరాజు, షేక్ మసూద్, గ్రామ పెద్దలు చిత్తలూరి లక్ష్మమ్మ, బుస్సా వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు...

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



చిట్యాల, నవంబర్ 19 (జనంసాక్షి):
భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలను చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. దేశ ఐక్యత, సమగ్ర అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆమె ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కౌన్సిలర్లు నాగిళ్ల సుధాకర్, గాలి యాదమ్మ లింగయ్య, కోనేటి ఎల్లయ్య, జెర్రిపోతుల సత్యనారాయణ, ఏర్పుల పరమేష్, బొబ్బలి సందీప్ రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, జిల్లా అధికార ప్రతినిధి పోకల దేవదాస్, టౌన్ అధ్యక్షుడు ఎద్దుల పురి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జయరాపు శివ, బెల్లి సత్తయ్య, ఎస్కే ఇబ్రహీం, కల్లెం నరసింహ, దాసరి నరసింహ,కోనేటి కృష్ణ,రుద్రారపు లింగయ్య, శ్రీకాంతాచారి తదితరులు పాల్గొన్నారు.

హస్తం వీడి.. కారు ఎక్కిన సిలివేరు విష్ణు!

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



మర్రిగూడ, నవంబర్ 19 (జనంసాక్షి)
మర్రిగూడ మండల రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. దామెర భీమనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం గట్టుప్పల మండల కేంద్రంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు.గట్టుప్పల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన బీఆర్ ఎస్ ముఖ్య నేతల సమక్షంలో సిలివేరు విష్ణు పార్టీలో చేరడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎంపీటీసీగా పనిచేసిన విష్ణు పార్టీ మారడం మర్రిగూడ మండల రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ చేరికతో మర్రిగూడ మండలంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి మరో రాజకీయ మార్పు చోటుచేసుకుంది. రానున్న రోజుల్లో ఈ పరిణామం స్థానిక రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగన్, మర్రిగూడెం మాజీ ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ.. ఖో-ఖో క్రీడాకారులకు ప్రోత్సాహం



వలిగొండ, నవంబర్ 19 (జనం సాక్షి)
లోతుకుంట గ్రామ బాలికల హాస్టల్‌ను ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి గురువారం తనిఖీ చేసి విద్యార్థినుల హాజరు, రికార్డులు, నిత్యావసర సరుకుల నాణ్యత, భోజన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం తెలంగాణ మోడల్ హైస్కూల్‌లో నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ జూనియర్ కళాశాల ఖో-ఖో ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలు క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి. రాములు, ఎస్ఐ ఎ. శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి.డి. ప్రసాద్, శీల రేణుక, ప్రధానోపాధ్యాయురాలు రయీసున్నీసా బేగం, ఫిజికల్ డైరెక్టర్ ఐలయ్య, ఖో-ఖో కార్యదర్శి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





నాగయ్య కుటుంబాన్ని పరామర్శించిన గీత కార్మిక సంఘం సభ్యులు

బొమ్మలరామారం నవంబర్ 19 (జనంసాక్షి)
మండలంలోని ఫకీర్ గూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బెజ్జనబోయిన నాగయ్య ఇటీవల తాడి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడంతో గురువారం గీత కార్మిక సంఘం సభ్యులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం అధ్యక్షుడు మల్లెబోయిన కిష్టయ్య, సర్పంచ్ బోయిని లతా నరసింహ, మాజీ సర్పంచ్ మెడబోయిన గణేష్, వార్డు సభ్యులు జోగు నరసింహ, గీత కార్మికులు సభ్యులు మెడబోయిన యాదగిరి, బోయిని గణేష్, జోగు శీను, శ్రీశైలం, శ్రీనివాస్, నరసింహ పలువురు గీత కార్మికుల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



రామన్నపేట, నవంబర్ 19 (జనంసాక్షి):
రామన్నపేట పట్టణ కేంద్రంలో మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం సుభాష్ సెంటర్లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హరిజనవాడ యుపిఎస్ హైస్కూల్లో విద్యార్థులకు నోట్ బుక్స్ లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పున్న జగన్మోహన్ జిల్లా కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, కొత్తపల్లి అబ్రహం కుమార్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బట్టే సంతోష్ కుమార్ మండల కాంగ్రెస్ నాయకులు సాల్వేర్ అశోక్, బొడ్డు సాలయ్య, వనం చంద్రశేఖర్, మొహమ్మద్ నాసర్, గుత్తా నర్సిరెడ్డి, కోట సుధాకర్, రాయిని రమేష్, మొహమ్మద్ అక్రం, గోదాసు శ్రీమన్నారాయణ, రాపోల్ రాజశేఖర్, నూతి పరుశురాం గౌడ్, బొడ్డు శంకరయ్య, మొహమ్మద్ మన్సూర్ అలీ, మహమ్మద్ రిజ్వాన్, గట్టు యాదయ్య, కక్కిరేణి రవీందర్, మొహమ్మద్ అజార్, గంగాపురం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల కోసం ఎమ్మెల్యే కృషి చేస్తుంటే విమర్శించడం తగదు :

ఇరిగి రాజు



చండూరు నవంబర్ 19 (జనంసాక్షి)
మునుగోడు ప్రాంత అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాడియా ద్వారా ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని, ఈ విషయంపై డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత విమర్శలు చేయడం సరైనది కాదని కాంగ్రెస్ పార్టీ డీసీసీ మాజీ జిల్లా కార్యదర్శి ఇరిగి రాజు ఒక ప్రకటనలో ఆరోపించారు. మునుగోడు ప్రాంత బిడ్డ అయి ఉండి ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు తీసుకురావడానికి కృషి చేయాల్సింది పోయి, అభివృద్ధి కాంక్షతో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్న ఎమ్మెల్యేను విమర్శించడం తగదని ఆయన పేర్కొన్నారు. నిస్వార్థంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యే గురించి విమర్శించే స్థాయి పున్న కైలాష్ నేతకు లేదని ఇరిగి రాజు తన ప్రకటనలో విమర్శించారు.

31 గుంటల భూమి కబ్జాకు గురైంది.. న్యాయం చేయండి.!

రైస్ మిల్లు యజమానులపై రైతు దారం పరమేష్ ఆరోపణ.. అధికారులకు బాధితుడి విజ్ఞప్తి

పి.ఏ.పల్లి,నవంబర్ 19(జనంసాక్షి):
పి.ఏ.పల్లి మండల కేంద్రంలోని రైస్ మిల్లు యజమానులు తనకు చెందిన 31 గుంటల వ్యవసాయ భూమిని అదనంగా ఆక్రమించి సాగులో కొనసాగుతున్నారని పి.ఏ.పల్లి గ్రామానికి చెందిన రైతు దారం పరమేష్ ఆరోపించారు.గురువారం విలేకరులతో తన ఆవేదనను వ్యక్తం చేస్తూ,తనకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.
ఈ సందర్భంగా రైతు పరమేష్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 815లో మొత్తం 14 ఎకరాల 21 గుంటల భూమి తన మామ బొలిగొర్ల కోటయ్య పేరిట ఉండేదని,ఆయనకు భార్య,ఒక్కరే కూతురని తెలిపారు.2006లో పీడబ్ల్యూడీ రోడ్డు నిర్మాణం కోసం ఎకరం 20 గుంటల భూమి పోగా,2009లో మైలు సురేందర్ రెడ్డికి రెండు ఎకరాలు,2012లో అలుగుబెల్లి శ్రీనివాస్ రెడ్డికి 1.20 గుంటలు,2022లో శ్రీనివాస్ రెడ్డికి మరో 30 గుంటల భూమిని విక్రయించినట్లు వివరించారు.
అదే విధంగా గతంలో కాశయ్య,రాములు వద్ద నుంచి రైస్ మిల్లు యజమానులు సర్వే నంబర్ 815లో రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేశారని తెలిపారు.ఈ విధంగా రైస్ మిల్లు యజమానులు కొనుగోలు చేసిన మొత్తం భూమి ఆరు ఎకరాల 10 గుంటలు కాగా,అదనంగా మరో 31 గుంటల భూమిని ఆక్రమించి మొత్తం ఏడు ఎకరాల ఒక గుంటలో కాస్తులో ఉన్నారని ఆరోపించారు.



తన భూమిని అదనంగా ఆక్రమించారని పలుమార్లు మిల్లు యజమానుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని, ప్రభుత్వ సర్వేయర్లను పిలిపించినప్పటికీ తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.శ్రీశైలం కాలువ నిర్మాణంలో సర్వే నంబర్ 815లోని భూమితో పాటు రైస్ మిల్లు ఉన్న ప్రాంతం కూడా ముంపునకు గురైనట్లు అవార్డు కాపీలు జారీ అయ్యాయని,ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందని తెలిపారు.తన పేరిట ఆరు ఎకరాల 31 గుంటల భూమి ఉన్నట్లు అవార్డు కాపీలో నమోదైందని,అయితే తాను ఆరు ఎకరాలకు మాత్రమే నష్టపరిహారం తీసుకున్నానని, మిగిలిన 31 గుంటలకు పరిహారం రావాల్సి ఉందని పేర్కొన్నారు.మిగిలిన నష్టపరిహారం ఇప్పిస్తానని చెబుతూ,ఆ భూమిపై తమ ఆధీనాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో మిల్లు యజమానులు తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.
ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ,సర్వే అధికారులు స్పందించి సర్వే నంబర్ 815లోని భూమిని సమగ్రంగా సర్వే చేసి,రికార్డుల ఆధారంగా హద్దులు నిర్ణయించాలని,తనకు రావాల్సిన 31 గుంటల భూమి విషయంలో న్యాయం చేయాలని దారం పరమేష్ అధికారులను కోరారు.



డిగ్రీ కళాశాలలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

రామన్నపేట, నవంబర్ 19 (జనంసాక్షి):
రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ భారత ఉక్కు మహిళగా ప్రసిద్ధిగాంచిన ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఆమె చేసిన సేవల్ని కొనియాడారు. నెహ్రూ తర్వాత అంతటి సుదీర్ఘకాలం ప్రధానిగా దేశానికి చేసిన సేవలు గణనీయమైనవని ప్రశంసించారు. భారతదేశాన్ని అన్నిరంగాలలో రాణించేలాగా వారు గావించిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. చరిత్ర విభాగాధిపతి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కిషన్ మాట్లాడుతూ దేశంలో పలు సంస్కరణలు చేపట్టడంలో ఇందిరా గాంధీ కీలక పాత్ర పోషించారని, బ్యాంకులను జాతీయం చేయడం, రాజభరణాల రద్దు వంటి సాహసోపేతమైన సంస్కరణలను తీసుకురావడం గొప్ప విషయమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్ జి. సునీత, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్. రత్న మంజుల, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.లక్ష్మి నీలిమతో పాటు అధ్యాపకుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి ఎసరు..
పంచాయతీ స్థలంలో అక్రమ నిర్మాణం!

ఖుదాభక్ష్‌పల్లిలో గ్రామపంచాయతీ స్థలం ఆక్రమణపై సీపీఐ జిల్లా నాయకుడు బూడిద సురేష్ ఫిర్యాదు



మర్రిగూడ, నవంబర్ 19 (జనంసాక్షి)
గ్రామపంచాయతీ అవసరాల కోసం కొనుగోలు చేసిన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ నల్లగొండ జిల్లా సీపీఐ నాయకుడు బూడిద సురేష్ మర్రిగూడ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మర్రిగూడ మండలంలోని ఖుదాభక్ష్‌పల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి, ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని ఆయన అధికారులను కోరారు. ఈ సందర్భంగా బూడిద సురేష్ మాట్లాడుతూ.. ఖుదాభక్ష్‌పల్లి గ్రామంలో గతంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణంతో పాటు ఇతర ప్రభుత్వ అవసరాల కోసం గ్రామానికి చెందిన నీల కమలమ్మ భర్త నరసింహ నుంచి సర్వే నంబర్ 322లో 0.4 గుంటల భూమిని గ్రామపంచాయతీ కొనుగోలు చేసినట్లు తెలిపారు. సదరు స్థలంలో గ్రామపంచాయతీ భవనం, బస్ షెల్టర్ నిర్మించగా, కొంత స్థలం మిగిలి ఉందన్నారు.అయితే గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ షేక్ షబ్బీర్ జీ ఆ మిగులు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలమని తెలిసి కూడా నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లయితే సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, ఆక్రమిత స్థలాన్ని గ్రామపంచాయతీ ఆధీనంలోకి తీసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఇస్మిల్ల మహేందర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు తిరుమలేష్, కొంటెద్ది గిరి తదితరులు పాల్గొన్నారు.





వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

23వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా కన్నులపండువగా స్వామివారి దివ్య కల్యాణం
చండూరు, నవంబర్ 19 (జనంసాక్షి)
చండూరు మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామంలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 23వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం మంగళవాయిద్యాలు, భజనలు, వేదమంత్రోచ్చారణలతో భక్తిమయంగా మారింది. స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణలు, విశేష పూజలు నిర్వహించి శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మంగళస్నానం, పంచామృతాభిషేకం, తలంబ్రాలు, మంగళహారతి తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు బోడంగిపర్తితో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను గ్రామ పురవీధుల గుండా భక్తజన సందోహం మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువతీ యువకులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

గుడిపల్లి ఎస్ఐ బోదాసు రాజుకు కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం

బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ శ్రేణులు
పి.ఏ.పల్లి,నవంబర్ 19(జనంసాక్షి):



పి. ఏ. పల్లి మండలం గుడిపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి సబ్‌ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన బోదాసు రాజు ను గురువారం గుడిపల్లి కాంగ్రెస్ పార్టీ నా యకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా,పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎస్ఐ బోదాసు రాజు కు శుభాకాంక్షలు తెలియజేసి,మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేస్తున్న సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో గుడిపల్లి మాజీ సర్పంచ్ శీలం శేఖర్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతం సైదులు,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యర్ర వెంకటేశ్వర్లు,ఎస్సీ సెల్ గుడిపల్లి మండల అధ్యక్షుడు రెడ్డిమల్ల రవి,కాంగ్రెస్ పార్టీ గుడిపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు జానపాటి రామలింగం,మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అర్వపల్లి వెంకటయ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయ సుధాకర్ రెడ్డి,వర్మాల దామోదర్ రెడ్డి,బండారు యాదయ్య,నిమ్మల నర్సింహా, కొమ్ము గిరిబాబు,గోలి వెంకటయ్య,సూరబోయిన రమేష్,గోలి రవి,యర్ర విజయ్ కుమార్,కొమ్ము నాగయ్య,ఘనపురం మహేష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మదారు శివకుమార్,ముండ్ల యాదగిరి, మదారు శంకర్,యర్ర శంకర్,యర్ర కోటేష్,యర్ర అభి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యం

సూర్యాపేట(జనంసాక్షి): చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు.గురువారం జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వివిధ సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించడంతో పాటు విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు గుణగంటి హేమ సతీష్, కొనతం రాజేష్ రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్ పర్సన్ ఇరిగి కోటేశ్వరి, తోట శ్యాంప్రసాద్, గ్రంధాలయ కార్యదర్శి రామచంద్రనాయక్, రంగారావు, సిబ్బంది నిర్మల, సృజన, భవాని, లక్ష్మమ్మ, ఉమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

